కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక



ఏప్రిల్ 2012

కొత్తపల్లి తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక ఏప్రియల్ 2012

మూలం: http://kottapalli.in/2012/04/welcome

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం 'కొత్తపల్లికి నాలుగేళ్ళు': వీరాంజనేయులు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222, 7702877670 ఇ-మెయిలు: team@kottapalli.in



విషయ సూచిక

ముందుమాట

ధారావాహిక

పిల్లలు రాసిన కథలు

పెద్దలు రాసిన కథలు

కార్టూన్ కథలు

అవీ -ఇవీ

పాట



తాతయ్య ఏదో పుస్తకాన్ని కళ్ళముందు పెట్టుకొని, పడక్కుర్చీలో హాయిగా నిద్రపోతున్నాడు.

దగ్గరకెళ్ళి 'అదేం పుస్తకం?' అని చూసింది చిట్టి.

పుస్తకం తిరగతిప్పి ఉంది. కవరు మీద అక్షరాలన్నీ వెనక్కి తిరిగి ఉన్నై.

చిట్టికి చదవటం వొచ్చు. ఇట్లా తిరగబడి ఉన్న వాటిని కూడుకొని చదవటం కూడా.

"ఒరేయ్! అన్నయ్యా!" కేక వేసింది అక్కడి నుండే.

తాతయ్య కొంచెం కదిలి, మళ్ళీ పడుకున్నాడు. అయినా తాతయ్యకు చెముడు- ఎంత అరిచినా ఏం కాదు. వినబడితే గదా?!

అన్నయ్య చిట్టికంటే రెండేళ్ళు పెద్ద.

"నీకు అక్షరాల్ని తిరగతిప్పి చదవటం వొచ్చా?" అడిగింది చిట్టి, వాడు వచ్చాక.

"ఓఁ!" అన్నాడు వాడు.

"మరైతే నేను రాస్తానొకటి. చదువుతావా?" అంది చిట్టి.

"ఓఁ!" అన్నాడు వాడు మళ్ళీ.

"ద డి గా డు వా న వి ది చ" రాసింది చిట్టి. "దీన్ని తిరగదిప్పి చదువు, చూద్దాం!"

వాడు పైకి చదవలేదు. మనసులోనే చదువుకున్నాడు. చదివి- ఉడుక్కున్నాడు.

"ఊఁ! చదువు!" అంది చిట్టి కిసకిసా నవ్వుతూ.

"చదివాలే!" అన్నాడు వాడు గుర్రుగా.

"అట్లా కాదు! పైకి చదవాలి, గట్టిగా!" అంది చిట్టి.

"ఆ సంగతి నువ్వు ముందు చెప్పలేదు. అందుకని నేను మనసులోనే చదివేసుకున్నాను" అన్నాడు అన్న తెలివిగా. మళ్ళీ అన్నాడు వాడే- "నీకు రాయటం మా బాగా వచ్చేమో- ఏదీ, నేను చెప్పింది రాయి, చూద్దాం!" అని.

"చెప్పు, నేనెందుకు రాయలేను?!" అంది చిట్టి- తనకి పెన్నుతో రాయటం అంటే ఇష్టం.

"ద డి గా ప పా న సి రా" -ఒక్కొక్క అక్షరం పలుక్కుంటూ రాసింది చిట్టి.

"ఇప్పుడు చదువుకో, వెనకనించి!" అన్నాడు అన్న, వికవికా నవ్వుతూ.


చిట్టి కూడబలుక్కొని చదివింది, వెనకనుండి. బయటికి చదవలేదు- తనూ మనసులోనే చదువుకున్నది. చదివినకొద్దీ ఆ పాప ముఖంలో రంగులు మారినై.

"చూశావా! దెబ్బకు దెబ్బ! చెల్లుకు చెల్లు!" అన్నాడు అన్న, పోబోతూ.

"ఆగాగు! చెల్లిని మోసం చెయ్యటం కాదు- చేతనైతే నేను రాసింది చదువు!" అన్నాడు తాతయ్య, అకస్మాత్తుగా కళ్ళు తెరిచి.

చిట్టి వింతగా చూసింది- "తాతయ్యకు వినబడిందే!" అని.

తాతయ్య రాశాడు పెద్దగా- వంకర టింకరగా, నవ్వుకుంటూ-



రాశాక దానికింద రెండు గీతలు గీశాడు గర్వంగా.

"నాకు కన్నడం రాదు! చేతనైతే తెలుగులో రాయి. అప్పుడు చదవకపోతే అడుగు!" దాన్ని చూడగానే అన్నాడు అన్న, గబుక్కున.

"ఇది తెలుగే బాబూ! హి హి! కళ్ళుపెట్టుకొని చూస్తే తెలుస్తుంది! కావాలంటే నా అద్దాలు ఇమ్మంటావా?" అన్నాడు తాతయ్య, ఎగతాళి చేస్తున్నట్లు.

"అన్న దాన్ని అటూ ఇటూ త్రిప్పి చూసి తంటాలు పడ్డాడు- "చూట్టానికి తెలుగులాగే ఉంది; కానీ ఇదేదో వంకరటింకరగా రాశావు నువ్వు" అన్నాడు.

తాత పాత పాట ఒకటి అందుకున్నాడు- "కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్, ఓడి పోలేదోయ్!" అని.


మీకు అర్థమైపోయిందిగా, తాతయ్య ఏం రాశాడో?! లేకపోతే ఓ అద్దం తెచ్చుకోండి మీరున్నూ!

ఇన్నాళ్ళూ -ఇదిగో, ఈ క్రింది పద్యంలోలాగా- మాకందరికీ అద్దాలై దిశానిర్దేశం చేసిన పెద్దలు ఎందరో! వాళ్ళందరికీ నమస్కారాలతో-

కొత్తపల్లి బృందం

తెలియని కార్యమెల్ల కడతేర్చుటకొక్క వివేకి చేకొనన్
వలయు- నట్టైన దిద్దుకొనవచ్చు; బ్రయోజన మాంద్యమేమియుం
గలుగదు- ఫాలమందు తిలకంబిడునప్పుడు చేత నద్దమున్
గలిగిన చక్కచేసికొనుగాదె? నరుండది చూచి, భాస్కరా!

"మనం చక్కగా బొట్టు పెట్టుకోవాలంటే చేతిలో అద్దం ఉంచుకోమూ?! అదే విధంగా, మనకు చేతకాని పని దేన్నైనా చెయ్యాల్సి వచ్చినప్పుడు, ఆ పనిలో నేర్పుకల వాళ్ల సాయం తీసుకోవాలి. అప్పుడు మన పనీ చక్కగా జరుగుతుంది; పని తీరు కూడా చక్కబడుతుంది" అని దీని భావం.



నీతి చంద్రిక

విగ్రహం-6

జరిగిన కథ: పక్షులన్నీ కొంగను బాగా కొట్టాయి. అటుపైన దాన్ని తమ రాజైన నెమలి దగ్గరికి లాక్కు వెళ్ళి, కఠినంగా శిక్షించమన్నాయి. ఆ సమయంలో అక్కడి మంత్రి అయిన గ్రద్ద ఒకటి "మీ మంత్రి ఎవరు?" అని అడిగింది కొంగను. ఇక చదవండి, నీతి చంద్రిక 30 వ భాగం...

మూలం: కీ. శే. కందుకూరి వీరేశలింగం *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

చావు తప్పి- కన్ను లొట్టపోయి వెనక్కి తిరిగివచ్చిన కొంగ, తమ రాజైన హంసకు విన్నవించుకున్నది- "అప్పుడు నేను చెప్పాను ఆ గద్దకు- "వివిధ విద్యలలో నిష్ణాతుడైన 'సర్వజ్ఞుడు' అనే చక్రవాక పక్షి మా ప్రధాని. ఆయనకు సర్వ ధర్మాలూ మూలమట్టంగా తెలుసు. సత్యము, శౌచము మొదలైన సద్గుణాలన్నీ ఆయనలో మూర్తీభవించి ఉన్నాయి.

"స్వదేశంలోనే పుట్టినవాడు, అనేక పరీక్షలలో నెగ్గినవాడు, అన్ని విషయాలూ తెలిసినవాడు, అన్ని పనులూ చేయగల నేర్పు గలవాడు,

ధైర్యము-శౌర్యము మొదలైన గుణాలు ఉన్నవాడు, ప్రతిభావంతుడు, అందరికీ ఆమోదయోగ్యుడు, ధర్మం ఏంటో-అధర్మం ఏంటో తెలిసినవాడు, స్వామి కార్య తత్పరత గలవాడు మాత్రమే మంత్రి పదవికి తగినవాడు" అని నీతి కోవిదులు చెబుతారు- దేవుని దయవల్ల ఈ గుణాలన్నీ మా మంత్రిగారిలో నెలకొని ఉన్నాయి" అని.



అరుణముఖుడు అనే చిలుకమంత్రి అప్పుడు ఆ నెమలిరాజుతో ఇలా అన్నది- "ప్రభూ! కర్పూరద్వీపం మొదలైన పేర్లుండే దీవులన్నీ మన ఈ జంబూద్వీపంలోని చిన్న చిన్న దీవులే; కనుక ఈ కర్పూర ద్వీపం కూడా నిజానికి తమరిదే అయి ఉండవచ్చు. అందువల్ల ఆ హంసరాజు కూడా 'అవును-కాదు' అనకుండా తమరి ఆజ్ఞను అనుసరించి మెలగవలసినవాడే అయి ఉంటాడు. అందువల్ల ఈ సంవత్సరం మొదలుకొని ప్రతి ఏడూ, తమరు పన్ను వసూలు చేయమని ఆజ్ఞాపించినప్పుడు, ఒక దూతను ఆ ద్వీపానికి కూడా పంపటం మొదట చేయవలసి ఉన్నది.

అగ్నిహోత్రుడికి ఎన్ని కట్టెలతోటీ తృప్తి కలగదు; అదే విధంగా రాజన్నవాడు ఎంతకీ తృప్తి చెంది ఊరుకోరాదు. 'తృప్తిలేని బ్రాహ్మణుడు చెడినట్లే, సంతృప్తుడైన రాజుకూడా చెడిపోతాడు' అని పెద్దలు చెబుతారు. కాబట్టి రాజన్నవాడు ఎప్పుడూ ఉత్సాహం వీడక- న్యాయ మార్గాన్నో, అన్యాయ మార్గాన్నో- దుర్మార్గులైన శత్రువులను జయిస్తూ ఉండాలి.

అంతే కాదు; ఇంకొక ధర్మ సూక్ష్మం కూడా ఉన్నది- శ్రద్ధగా వినండి: 'రాజ్యం వీరభోజ్యం'- (వీరులెవ్వరో రాజ్యం వారిదే) అని ధర్మశాస్త్రం తెలిసినవారు చెబుతుంటారు. కాబట్టి ఇప్పుడు తగిన సైన్యంతో బలంగా తరలి వెళ్ళి,

ఆ దీవిని చుట్టు ముట్టటం కూడా మంచి పనే- ఆ రాజెవరో మంచి మాటలకు లొంగాడా, సరి! అట్లాకాక, ప్రభువుల వారి మాటను లక్ష్యపెట్టక, తమరిని ఎదిరించబూనితే దానికి తగిన ప్రతిఫలం తక్షణం అనుభవిస్తాడు. అందువల్ల, తమరు నా మాటను త్రోసిపుచ్చకండి- దూతను ఎవరినైనా ఒకరిని పంపి, శత్రువు మనసు తెలుసుకోండి!" అన్నది.

అది విని, చంద్ర మహారాజు కూడా చిరునవ్వుతో, వికసించిన ముఖంతో "అవునవును! అలా చేద్దాం" అని తల ఊపాడు!

ఔరా! ఏమనాలి? 'రాజ్యపు మదంతో కళ్ళు కానని వాడు, మూర్ఖుడు, ధన గర్వంతో కళ్ళు మూసుకుపోయిన వాడు, వెర్రివాడు'- వీళ్ళు నలుగురూ 'ఇది సాధ్యం-ఇది అసాధ్యం' అని ఏమాత్రం ఆలోచన చెయ్యక, 'దొరకనివాటిని కూడా దొరికేవిగా తలుస్తారు' అని పెద్దలు చెప్పిన మాటలు తప్పుతాయా?

రాజ్యలోభమే కదా, ఈ చెడు ఆలోచనలకు అన్నిటికీ మూలం? తొట్టిలో ఉన్న నిప్పు ఎలాగైతే చెట్టును కాల్చివేస్తుందో, అట్లాగే హృదయంలోని 'దురాశ' అనే అగ్ని మనిషిని కాల్చివేస్తుంది. అన్ని అనర్థాలకూ మూలం ఆశే. అట్లాంటి ఆశను విడిచిపెట్టి, అందిన దానితో తృప్తి చెంది సంతోషపడే వాడే ధన్యుడు.

సరే, ఆ సమయంలో నాకు తమరి యుద్ధకౌశలమూ, రణ దక్షత గుర్తుకొచ్చి- 'అయ్యో! వీళ్లకు ప్రాణాలమీద ఏమాత్రం ఆశ ఉన్నట్లు లేదే!" అనిపించింది.

అది అట్లా ఉండనీండి- విషంతో సమానాలైన ఆ దుర్మార్గపు మాటలు విని నా మనస్సుకు చాలా బాధ కలిగింది. అయినా నాకు నేను సర్ది చెప్పుకొని, ఆ రాజువైపు తిరిగి- "నేను ఒక సంగతి విన్నవించుకుంటాను. కోపపడరు కదా?!" అని అడిగాను.

"లేదు లేదు- చెప్పు" అని ఆయనచేత అనిపించుకొని, ఈ హితవచనాలు పలికాను-

"లోకంలో ఇతరుల సొమ్ముల్ని రమ్మనగానే వస్తాయా, ఎక్కడైనా? ఎందుకు, కాని పనిని గురించి వృధాగా సమయం వెచ్చించి ప్రయాస

పడతారు? చెప్పేవాళ్ళు ఏదో, చెప్పారు అనుకున్నాగానీ, వినే వాళ్లకయినా జ్ఞానం ఉండాలికదా!



అట్లాకాక, 'దున్న ఈనింది' అనగానే 'దూడను కట్టెయ్యండి' అంటే, బుద్ధి రచ్చకెక్కుతుంది తప్పిస్తే దానివల్ల కోరిన కార్యం నెరవేరనే నెరవేరదే!

అన్నీ తెలిసినవాడివి; నీకు తెలీని ధర్మం, అధర్మం వేరే ఏమున్నాయి? అంతులేని శత్రు సమూహాల విజృంభణాన్ని కూడా అణచి-వేయటంలో పండినవాడు మా రాజు హిరణ్యగర్భుడు. వాళ్ళు-వీళ్ళలాగా ఆయన తక్కువవాడు అనుకోకండి. 'పరాక్రమంలో తిరుగు లేనివాడాయన' అని గుర్తించి, అటుపైన ఏదైనా నిర్ణయం తీసుకోండి.

పోగాలం దాపురించి, ప్రాణాలంటే తీపి తక్కువై, పొట్ట ఉబ్బరం తగ్గేందుకు ఏవేవో మాటలు మాట్లాడినంత మాత్రాన రాజ్యం దొరకదు. చింతలేమీ లేనట్లు, ఊరికే ఎందుకు, చెట్టును కొట్టి మీద వేసుకుంటారు? ఆయన పరాక్రమం ముందు ఎంత వారైనా నిలువలేరు. మీమీ పంతాలన్నీ ఆయన నొసలు ముడిచేంతవరకే అని గుర్తుంచుకోండి- అటుపైన అవేవీ చెల్లవు. ఆయన దగ్గర ఉన్న వాళ్ళు కూడా గొప్ప యుద్ధవిశారదులు. మీ అహంకారాన్ని వదలండి; మా మహారాజుతో వైరం పెట్టుకోకండి; మీ ప్రాణాల్ని కాపాడుకోండి. నోటి మాటలతోటే రాజ్యాధిపత్యం వచ్చేస్తుందంటే నేను కూడా అనవచ్చు- 'మా ప్రభువైన హిరణ్యగర్భుడికి కూడా ఈ జంబూద్వీపంపైన అధికారం ఉన్నది' అని! అయినా ఈ చప్పిడి మాటలవల్ల ఏం

ప్రయోజనం?!

ఇక్కడ చేరిన ఈ కొందరు తక్కువ రకం వారి నోళ్లకు అడ్డు లేదు గనుక, ఏలినవారి ముఖస్తుతి కోసం సభలో నోటికి వచ్చినట్లల్లా వదరచ్చు గానీ, తమ తప్పులవల్ల పని చెడిపోయి, ప్రభువులవారికి ఏదైనా ఆపద వాటిల్లినప్పుడు, ఏం చెయ్యాలో తోచక, ఆశ్చర్యంతో స్తంభించిపోతాయి, వీళ్ళ మనసులు. అప్పుడు ఆకాశంకేసి చూడటం తప్ప వీళ్ళకి వేరే ఏమీ చేత కాదు. చిత్రవర్ణుడికి మా కర్పూర ద్వీపంపైన అధికారం ఉన్నదో, హిరణ్యగర్భుడికి మీ జంబూద్వీపంపై అధికారం ఉన్నదో నిర్ణయించేందుకు ఎలా వీలౌతుంది?" అన్నాను.

అప్పుడు విషసర్పాలను తినే ఆ నెమలి రాజు చిరునవ్వు నవ్వి, నాతో - "తొందర ఎందుకు? యుద్ధంతోటే అన్ని విషయాలూ తేలతాయి. ఇప్పుడు పోయి మీ రాజును యుద్ధానికి సిద్ధం కమ్మను.

ఇదిగో, ఒక్క క్షణం నిలు- మా దూత కూడా వస్తాడు, నీతో బాటు-" అని, తమ మంత్రివైపు తిరిగి "మంత్రిగారూ! మనకు ఇప్పుడు ఒక దూతను పంపవలసిన అవసరం ఉదయించింది. 'దక్షత, పనిని నెరవేర్చుకునే సమర్ధత, పాండిత్యం, ఇతరుల రహస్యాలను తెలుసుకోవటంలో నేర్పు ఉన్నవాడు' దూత పనికి తగినవాడు. ఈ కొంగతోబాటు హిరణ్యగర్భుడి దగ్గరికి దూతగా పంపేందుకు తగినవాడెవడో చెప్పండి" అన్నాడు.



అప్పుడు దూరదర్శి ఆ చిలుక వైపు చూపించి- "ఇదిగో, ఈ అరుణముఖుడే మీరు చెప్పిన అన్ని గుణాలూ కలవాడు- వయసు మళ్ళినవాడు; ఉత్తమ గుణాలున్నవాడు; మనకు అత్యంత విశ్వసనీయుడు- కాబట్టి

దూతగా వెళ్ళేదుకు ఇతనే తగినవాడు. ఇతనిని పంపండి" అన్నది.

అయితే అప్పుడా చిలుక ముందుకు వచ్చి వినయంగా "ప్రభూ! నా నిలువెత్తు డబ్బు ఇచ్చినా అహంకారంతో విర్రవీగే ఈ కొంగతోపాటు పోయేందుకు ఇష్టపడను. ఎన్ని రకాలుగా చూసినా 'నన్ను ఈ కుత్సితపు కొంగతో పాటు పంపటం కొంచెం కూడా మేలు చేయదు' అనే అనిపిస్తున్నది. ప్రభువులవారి మాటకు ఎదురు చెబుతున్నాను అని కోపగించుకోకండి- ముందు నా మనవిని వినండి- అటుపైన తమరికి నచ్చినట్లు చేద్దురుగాని.

ఈ టక్కరి కొంగ ముందు వెళ్లటమే ఉత్తమం. వీడి వెనుకనే నేను కూడా వెళ్తాను. అన్ని ధర్మాలూ తెలిసిన మీ అంతటివారికి చెప్పేవాడిని కాదు- నా తప్పును మన్నించండి- దుర్మార్గుడితో కలిసి నడవటం కూడా ఆపదలనే తెచ్చి పెడుతుంది. ఇతడి గుణాలు ఎలాంటివో మనం మనవారి నుండి కథలు కథలుగా విని ఉన్నాం. కొంచెం దూరం పోనిచ్చి, అక్కడ నన్ను నిశ్శబ్దంగా మట్టుపెడితే ఏది, దిక్కు?

అంతేకాదు- పువ్వుతో కలిసి ఉన్న నారకూడా తలమీదికి ఎక్కి కులికినట్లుగా, మంచివారితో చేరిన దుర్మార్గుడికీ అనవసరపు గౌరవం లభిస్తుంది. అలాగే ఇనుముతో కూడిన అగ్ని దేవుడికి కూడా సమ్మెటపోట్లు తప్పని చందాన, హీనుడితో కలిసి ఉన్న మర్యాదస్తుడికి కూడా అగౌరవం ఎదురవుతుంది. సహవాసం వల్లనే గౌరవం, అగౌరవం లభిస్తుంటాయి కదా? చెడ్డవాళ్ళు చేసే పనుల ఫలితాన్ని వాళ్లకు సన్నిహితులుగా ఉన్న మంచివాళ్ళు కూడా తప్పక అనుభవించాల్సి వస్తుంది. ఇదివరకు ఒక కాకితో సావాసం చేసిన హంస కష్టాల పాలవ్వలేదా? తమరికి ఆ కథ చెబుతాను వినండి- అని హంస కాకి కథ చెప్ప సాగింది.

(-ఆ కథ వచ్చేసారి..)

అన్నింటిలోకీ ప్రధానమైనది మనసే



తెలివిగల స్నేహితులు

రచన: జి.సందీప్, 8 వతరగతి, తేజ టాలెంట్ స్కూలు, నల్గొండ జిల్లా.

మాలిపురం మామూలుగా చాలా ప్రశాంతంగా ఉండేది. అయితే ఎక్కడినుండి వచ్చిందో, దొంగల గుంపు ఒకటి అక్కడికి వచ్చి చేరుకున్నది. రోజూ ఎవరో ఒకరి ఇల్లు దోపిడీకి గురవుతున్నది. ఊళ్ళోవాళ్ళు వెళ్ళి రాజుగారికి మొరపెట్టుకుందామని అనుకుంటున్నంతలో రాజుగారే ఒక దండోరా వేసే మనిషిని పంపించారు అక్కడికి: "రాజ భవనాన్ని దోచిన దొంగల్లో కొందరు మాలిపురం అడవుల్లో తలదాచుకుంటున్నట్లు తెలియవచ్చింది. వాళ్లని పట్టుకున్నా, వాళ్ళు దొంగిలించిన సొమ్మును పట్టించినా రాజుగారు

ప్రసన్నులౌతారు; మాలిపురం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారహో!" అని.

మాలిపురంలోనే ఉండే ప్రవీణ్, మహేష్ మంచి స్నేహితులు. ఇద్దరూ కలిసి మెలసి ఉండేవాళ్ళు; ఒకరి కష్టాల్లో ఒకరు పాలుపంచుకునేవాళ్ళు. ఇద్దరికీ మంచి తెలివి తేటలు ఉన్నై; చదువులో కూడా ముందుండేవాళ్ళు. వాళ్ళిద్దరూ విన్నారు ఈ దండోరాని.

"రక్షణ కల్పించవలసిన రాజుగారే దొంగల్ని పట్టుకోలేకపోయారంటే వీళ్ళెవరో గుండెలు తీసిన బంట్లు అయి ఉండాలి" అన్నాడు ప్రవీణ్.

"ఎన్ని గుండెలు తీసిన బంట్లైనా సరే, వాళ్ళు దొంగలు! వాళ్ళని మనం పట్టిద్దాం; మన ఊరికి ప్రత్యేకనిధులు సంపాదించిపెడదాం" అన్నాడు మహేష్.

"దొంగలు మన అడవిలోనే ఉన్నారు. ఈ రోజు రాత్రికి మళ్ళీ ఊర్లోకి వస్తారు- ఇంకో ఇంట్లో దొంగతనానికి. మనం ఊరి పొలిమేరల్లో ఉన్న మర్రిచెట్టు తొర్రలో దాక్కుందాం. దొంగలు అటుగా వస్తున్నప్పుడు వాళ్ళు మాట్లాడే మాటలు వినబడతాయి మనకు. ఒకసారి అలా వాళ్ళ పథకాలేంటో తెలియవస్తే, ఆనక మనం ఏం చెయ్యాలో ఆలోచించుకోవచ్చు!" అన్నాడు ప్రవీణ్.

"సరే" అనుకొని వాళ్ళిద్దరూ ఆరోజు చీకటి పడగానే పోయి ఆ మర్రి చెట్టు తొర్రలో దూరి కూర్చున్నారు. కొద్ది సేపట్లో అర్థరాత్రి అవుతుందనగా, చీకట్లోంచి మాటలు వినబడ్డాయి వాళ్ళకు. చూస్తూ చూస్తూండగానే దొంగలు మర్రిచెట్టు దగ్గరికి వచ్చేసి, ఆ చెట్టు మొదట్లోనే కూర్చున్నారు! వాళ్ళ మాటలనుండి అర్థమైంది ఏంటంటే, వాళ్ళు మరొక రెండు రోజులు మాత్రమే ఈ ప్రాంతంలో ఉండబోతున్నారు. ఆలోగా వ్యాపారి వరదయ్య ఇంటినీ, కరణం కామయ్య ఇంటినీ దోచుకోనున్నారు వాళ్ళు!

తొర్రలో దాక్కున్న స్నేహితులకు ఏం చెయ్యాలో తోచలేదు. ఇంతలో మహేష్ కడుపులో పేగులు గుడ గుడమని శబ్దం చేశాయి. "ఎవరది?!" అని అరిచాడొక దొంగ.

మరుక్షణం మహేష్ ఆపుకోలేక పెద్దగా ఒక పిత్తు పిత్తాడు! "ఎవ్వర్రా అది!" అని మరొక దొంగ వీళ్ళున్న తొర్ర దగ్గరికి రాబోయాడు.

"ఇప్పుడేం చెయ్యాలి?!" ప్రవీణ్ మెదడు చురుకుగా పనిచేసింది. వాడు పెద్ద గొంతుతో "హహ్హాహ్హా హ్హా!" అని నవ్వాడు. దొంగలు బిత్తరపోయి చూస్తున్నంతలో మహేష్ మరో పిత్తు పిత్తటం, "నేను ఈ ఊరిని కాపాడే రాక్షసుడినిరా! మీరు రాక రాక నా ఇంటికే రావటం మీరు చేసుకున్న అదృష్టం. నాకోసం మీరు తెచ్చిన బహుమతులన్నిటినీ అక్కడ పెట్టి వెనక్కి తిరిగి చూడకుండా పోండి! రాజుగారిదగ్గర దోచుకున్నదంతా నాకే ఇవ్వాలి, ఏమంటారు?!" అని ప్రవీణ్ హుంకరించటం గబగబా జరిగిపోయాయి. వణికి పోయిన దొంగలు చేతిలో ఉన్న ధనాన్ని మొత్తం అక్కడే వదిలేసి తలో దిక్కుకూ పరుగు తీశారు.

ఇక ప్రమాదం లేదని నిశ్చయించుకున్నాక మిత్రులిద్దరూ తొర్రలోంచి బయటికి వచ్చి చూస్తే అక్కడ చుట్టూతా చాలా నగలు, బంగారు నాణాలు కనిపించాయి. ఇద్దరూ వాటినన్నిటినీ తీసుకెళ్ళి ఊరి కొత్వాలుకు అందించారు. "ఈరోజు రాత్రికి వరదయ్య గారి ఇంట్లోను, బహుశ: కరణంగారి ఇంట్లో కూడాను దొంగలు పడనున్నారు. వీలైనంత మంది జనాలను తీసుకెళ్ళి మీరు ఆ యిళ్ళలో దాగున్నారంటే దొంగలందరూ దొరుకుతారు" అని కబురు అందించారు కూడాను.



ఇంకేముంది, ఊళ్ళో మెరికల్లాంటి యువకుల్ని కొందర్ని వెంట బెట్టుకొని ఆ రెండు ఇళ్ళలోనూ వేచి ఉన్నాడు కొత్వాలు. ఆ రాత్రి చీకట్లో దొంగతనానికి వచ్చిన దొంగలు తేరుకునేలోగా జనాలందరూ దొంగల మీద పడి కాళ్ళు చేతులు కట్టి పడేశారు!

సంగతి తెలుసుకున్న రాజుగారు ఊరు వాళ్లను

రాజధానికి పిలిపించుకున్నారు.

దొంగలు దోచుకున్న సంపదంతా ఎవరిది వాళ్ళకు అందింది. జరిగిందంతా విని రాజుగారు కడుపుబ్బ నవ్వారు. ప్రవీణ్, మహేష్‌లను ఘనంగా సన్మానించారు.

మాలిపురం అభివృద్ధికోసం ప్రత్యేక నిధులందించారు.

క్రింది పదాలను జాగ్రత్తగా గమనించండి.. వీటి అమరికలో గొప్పదనం అర్థమైందా?

వం	కా	య
కా	ర	ము
య	ము	డు

వ	ని	త
ని	క్క	మ్ము
త	మ్ము	డు

జ	న	ము
న	క్క	లు
ము	లు	గు

జ	ను	ము
ను	రు	గు
ము	గు	ద

కా	మ	ము
మ	మ	త
ము	త	క

జ	ల	గ
ల	వ	ణ
గ	ణ	ము

ప్రతి చదరంలోనూ అక్షరాలను నిలువుగాను అడ్డంగాను చదవండి..అవే పదాలు వస్తై!

సౌజన్యం:1955 సెప్టెంబరు "బాల"



తమ్ముడిచ్చిన స్ఫూర్తి

రచన: కె.రాకేష్, 10 వతరగతి, నందన గ్రామీణ పాఠశాల, చౌడవరం, గుంటూరు జిల్లా.

గుంటూరు జిల్లాలో ఓ గ్రామంలో వసతులూ సౌకర్యాలు అంతగాలేవు; ఊరి మొత్తం మీదా ఒకే ఒక బడి ఉంది. ఆ బడిలో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు బోధిస్తారు. అక్కడ ఏడో తరగతి చదివే రాముడు అన్నింటిలోను అందరికంటే ముందుండేవాడు. అతని అన్నయ్య కృష్ణుడు, ఇప్పుడు పదో తరగతి-చదువులో కొంచెం వెనకబడేవాడు.

క్రితంసారి వార్షిక పరీక్షలలో రాముడికి 600 కు గాను 550 మార్కులు వచ్చాయి. అన్న కృష్ణుడు మటుకు 350 మార్కులే తెచ్చుకొని పదో తరగతిలోకి వచ్చాడు.

బడికి వెళ్తే ఉపాధ్యాయులు, ఇంటికెళ్తే నాన్న- "నీకు తెలివి లేదురా, నువ్వు చదవలేవు" అని కృష్ణుడిని ఎప్పుడూ తిడుతూనే ఉండేవాళ్ళు. "నువ్వు పదో తరగతిలో కనీసం 500 మార్కులు సంపాదించుకోపోతే ఇక చదువు ఆపించేస్తా. ఏదైనా పనిలో చేర్పిస్తా"

అని బెదిరిస్తూండేవాడు నాన్న. "కనీసం తమ్ముడికున్నంత శ్రద్ధ కూడా లేకపోతే ఎలారా? ఏదైనా పని నేర్చుకో, పోనీ" అని అమ్మ సూదిలాగా పొడుస్తుండేది వాడిని.

డిసెంబరు నెల వచ్చేసింది. 10 వతరగతి పబ్లిక్‌పరీక్షలకు ఇంకో మూడు నెలల సమయం మాత్రమే ఉంది. బడిలో అన్ని సబ్జెక్టులూ దాదాపు చివరికి వచ్చేశాయి. కానీ కృష్ణుడికి మాత్రం ఏ సమాధానాలూ రావు!

వాడికి తన కష్టాన్ని తలచుకొని ఏడుపు వచ్చేసింది ఒకరోజున. చెట్టు క్రింద కూర్చొని కుమిలి కుమిలి ఏడుస్తున్న అన్నను చూసి రాముడికి చాలా బాధ వేసింది. అతనిని ఓదార్చేందుకు ప్రయత్నించాడు. అయితే వాడు ఓదార్చిన కొద్దీ కృష్ణుడి బాధ మరింత ఎక్కువైంది. "నీకేమిరా, నువ్వు తెలివిగల వాడివి, నువ్వు చదువుతావు; నేనేకద, తెలివిలేని మొద్దును! నాకేమీ రాదు" అని ఏడుస్తున్నాడు.

"నేనంటే చదువుతున్నాననుకో, మరి నువ్వేం చేస్తున్నావన్నా, రోజూ బడికెళ్ళి?" అని ప్రశ్నించాడు రాముడు.

"నేను కూడా చదువుతున్నానురా, కానీ ఏదీ గుర్తుండటం లేదు" అన్నాడు కృష్ణుడు, ఏడుపు ఆపి.

"అన్నయ్యా! నువ్వు ఎప్పుడు చదివినా ఏదో భయంతో చదువుతున్నావు తప్ప, ఇష్టంగా చదవడం లేదు. ఇంక- నీకు ఏదీ గుర్తుండట్లేదు అన్నావే, అదేమీ కాదు. అట్లాగే జరిగితే నీకు ఈ కాసిని మార్కులూ వచ్చేవి కాదు గద! నీకు తెలివి తేటలు ఉన్నాయి, కృషి చేసే శక్తీ ఉన్నది- కాసింత భయం వదిలేసి చదువురా అన్నయ్యా; అన్నీ గుర్తుంటాయి!" అన్నాడు రాముడు.

"తల్లిదండ్రులంటేనూ, గురువులంటేనూ భయం-భక్తి ఉండాలి కదరా" అన్నాడు కృష్ణుడు.

"ఏమోనన్నా, కానీ మనం చదివే విషయాల పట్ల 'భయం-భక్తీ' ఉన్నా-లేకున్నా, 'శ్రద్ధ-ఆసక్తి'మటుకు ఉండాలి అని అనిపిస్తుంది నాకు. ఇష్టంగా, శ్రద్ధగా దేన్ని చదివినా అది గుర్తుండిపోతుంది, నిజం" అన్నాడు

రాముడు.

"అయినా ఇప్పుడు అనుకొని ఏం ప్రయోజనంరా? డిసెంబరు వచ్చేసింది! ఇంకా మూడు నెలలే ఉన్నది!" అన్నాడు కృష్ణుడు, కంట తడి పెడుతూ.

"దానిదేముందన్నా, మూడు నెలలు ఏమంత తక్కువ సమయం కాదు. మనసుపెట్టి చదివితే మూడు నెలల్లో అంతా వచ్చేస్తుంది. ప్రయత్నించి చూడు" అన్నాడు రాముడు, ఉత్సాహంగా.

తమ్ముడి మాటలు కృష్ణుడిలో ఉత్సాహాన్ని నింపాయి. "సరేరా తమ్ముడూ! ఇప్పటినుండీ నువ్వు చెప్పినట్లు మనసుపెట్టి, పట్టుదలగా చదువుతాను. ఐదు వందల మార్కులు దాటాలని ప్రయత్నిస్తానురా, చూస్తూండు" అన్నాడు వాడు పట్టుదలగా.

రాముడు కూడా నవ్వుతూ "అన్నా! నువ్వు ఐదు వందల మార్కులు తెచ్చుకొంటే నీకు అందమైన బహుమతి ఇస్తాను. రా, మరి చదువు మొదలు పెడదాం" అన్నాడు.

కృష్ణుడు అప్పట్నుంచీ బాగా చదివాడు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వాడికి 530 మార్కులు వచ్చాయి. తరగతి మొత్తంలోను వాడిది మూడోర్యాంకు!

"చివర్లో చివర్లో బాగా చదివావురా, మంచి మార్కులే సంపాదించావు!" అని టీచర్లు అందరూ ఆశ్చర్యపోయారు. "పర్లేదురా కృష్ణా" అని అమ్మ,నాన్నలు సంతోషపడ్డారు.

రాముడు సొంత డబ్బులతో ఒక 'English dictionary' కొని అన్నకు బహుమతిగా ఇచ్చాడు- "మూడు నెలలు చదివి ఐదొందల ముప్ఫై మార్కులు తెచ్చుకున్నావురా, అన్నయ్యా! మరి మొదటినుండీ చదివి ఉంటే ఏమయ్యేదో!" అంటూ.

"ఇకనుండీ చూసుకోరా, దంచేస్తాను. అయినా భయం-భక్తుల గురించి నువ్వు భలే చెప్పావురా, నాకు చాలా నచ్చింది!" అన్నాడు కృష్ణుడు, రాముడిని మెచ్చుకుంటూ.

దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్! -గురజాడ అప్పారావు



స్వేచ్ఛ

మూలం: బి.నవీన్, 8 వతరగతి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, చెన్నేకొత్తపల్లి.
మార్పు చేర్పులు: కొత్తపల్లి



రవి స్కూల్‌కి వెళ్ళే దారిలో ఒక పెద్ద చెట్టు ఉన్నది. వాడికి ఆ చెట్టంటే చాలా ఇష్టం. ఒక శనివారంనాడు సాయంత్రం వాడు బడి నుండి ఇంటికి వస్తుంటే ఆ చెట్టు తొర్రలోంచి "కీచ్ కీచ్" మని శబ్దాలు వినబడ్డాయి.

రవి మెల్లగా ఆ తొర్ర లోకి తొంగి చూశాడు. లోపల రెండు రామచిలుకలు! వాడు గబుక్కున ఆ రెండు చిలకలనూ పట్టేసుకొని, ఇంటికి తీసుకెళ్ళాడు.

రవివాళ్ళ అమ్మ ఆ చిలకలను చూసి మురిసిపోయింది. "వీటిని మనం పెంచుకుందామా, అమ్మా? ఒక పంజరం తెచ్చుకొని, దానిలో పెడదాం వీటిని!" అడిగాడు రవి. "అట్లా చేద్దాంరా, నాకుకూడా

రాము చిలుకలంటే చాలా ఇష్టం. బజారుకెళ్ళి ఇప్పుడే ఒక పంజరం కొనుక్కురా" అని డబ్బులిచ్చి పంపింది అమ్మ.

రవి పంజరంతోబాటు చిలకలకోసమని కొన్ని అరటి పండ్లు, జామ పండ్లు, ద్రాక్షపండ్లు తీసుకొచ్చాడు. అమ్మ, రవి ఇద్దరూ కలిసి చిలుకలను పంజరంలో పెట్టారు. అటుపైన సన్నగా తరిగిన పళ్ళ ముక్కలను ఓ చిన్న గిన్నెలో వేసి పెట్టారు.



అయితే చిలుకలు రెండూ "కుయ్ కయ్ " మనకుండా కూర్చున్నై. వీళ్ళు పెట్టిన పళ్ళ వైపుకు కూడా చూడలేదు.

"అమ్మా! అవి పళ్ళు తినటం లేదెందుకు?" అని చాలాసార్లు అడిగాడు రవి. "ఏమోరా, మీ నాన్న వచ్చాక అడుగుదాం" అన్నది అమ్మ.

ఆరోజు రవి వాళ్ల నాన్నగారు వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. నాన్న రాగానే రవి ఉత్సాహంగా పంజరాన్ని చూపించాడు. దాన్ని చూడగానే నాన్నగారి ముఖం ఎందుకో రంగులు మారింది.

"ఈ చిలుకలు పళ్ళు తినటంలేదు నాన్నా. ఎందుకు?" అడిగాడు రవి.

"అవి బాధ పడుతూ ఉంటాయిరా, హాయిగా ఆకాశంలో తిరిగే పక్షుల్ని నువ్వు పట్టుకొచ్చి పంజరంలో పెడితే బాధ పడవూ? వాటికి ఆకలి ఎట్లా అవుతుంది?" అన్నాడు నాన్న, స్నానాల గదిలోకి వెళ్తూ.

మరునాడు ఆదివారం. రవి నిద్ర లేచేసరికి ఇంట్లో ఎవ్వరూ లేరు. "అమ్మా! నాన్నా!" అని కొంచెంసేపు పిలిచి ఊరుకున్నాడు రవి. బయటికి వెళ్ళి చూద్దామనుకున్నాడు. ఇంటి తలుపులు బయటివైపు నుండి వేసి ఉన్నై. పాచి ముఖంతో ఉండేదెందుకని వెళ్ళి ముఖం

కడుక్కొని వచ్చి కూర్చున్నాడు వాడు. లోపల, వంటగదిలో స్టౌ ప్రక్కనే బ్రెడ్డు పెట్టి ఉన్నది. కానీ వాడికి ఏమీ తినబుద్ధి కాలేదు. "వీళ్ళు ఎటు వెళ్ళారు? నన్నొక్కడినే వదిలి ఎందుకెళ్ళారు? ఇంటి తలుపులు వేసేసి వెళ్ళారెందుకు?" అని ఒకటే ఆలోచనలు. ఇంట్లో ఫోనులు ఏవీ పని చేయటం లేదు. వెళ్ళి తలుపులు బాదాడు దబదబా. ఎవ్వరూ రాలేదు. రవికి ఏడుపొచ్చింది. సమయం గడుస్తూ పోయింది. పది గంటలు దాటాక వచ్చారు, అమ్మ-నాన్న ఇద్దరూ.

"ఏమిరా రామూ? ఏమీ తినలేదు?" లోనికి వస్తూనే అడిగింది అమ్మ.

"చాలా సంతోషంగా ఆటలాడుకొని ఉంటావు కదూ, ఇవాళ్ళ, ఆదివారమని!" అన్నాడు నాన్న. "ఇంతకీ మీ ఫ్రెండ్స్ రామచిలుకలు ఏమంటున్నాయి?" అంటూనే మూలన ముడుచుకొని కూర్చున్న రవిని చూసి ఇద్దరూ దగ్గరకొచ్చారు. "ఏమైంది?" అని అడిగారు.

"నన్ను ఇంట్లో పెట్టేసి మీరిద్దరూ ఎక్కడికెళ్ళారు? నాకు ఎంత ఏడుపొచ్చిందో తెలుసా?" అరిచినంత పని చేశాడు రవి.

నాన్న రామచిలుకలున్న పంజరం దగ్గరికెళ్ళి చూస్తున్నాడు. "ఇవి ఇంకా ఏమీ తినలేదు. అట్లాగే మూగగా కూర్చొని ఉన్నాయి. నిన్ను మీ ఇంట్లోనే రెండు మూడు గంటలపాటు బంధించి వెళ్తే ఇంత బాధ పడ్డావు రవీ, మరి వీటిని రాత్రంతా ఇలా ఒక క్రొత్త చోట, పంజరంలో బంధించి పెడితే అవి సంతోషంగా ఎలా ఉండగల్గుతాయి?" అన్నాడు మెల్లగా.

రవి ఏడుపు ఆగిపోయింది. అమ్మ కళ్ళలోకి చూశాడు. అమ్మ సీరియస్ గా తల ఊపింది. "నాకు అర్థమైంది నాన్నా! వాటిని వదిలేద్దాం. ఆకాశంలో ఎగిరే పక్షుల్ని ఇలా బంధించి పెట్టకూడదు" అన్నాడు వాడు. నాన్న, రవి పంజరాన్ని మిద్దెమీదికి తీసుకెళ్ళి చిలుకల్ని వదిలిపెట్టారు. రెక్కలు టపటప లాడించుకుంటూ పైకెగిరి, అవి వాళ్లింటి మామిడి చెట్టు మీద వాలి "కీచ్ కీచ్" మని అరిచాయి సంతోషంగా.



స్నేహం

రచన: తరుణి,సౌమ్య, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, గడ్డంనాగేపల్లి, నార్పల.




మూడవ తరగతి చదివే రాజు, రమేష్ మంచి స్నేహితులు. కలిసి తిరిగేవాళ్ళు, కలిసి చదివేవాళ్ళు, ఒకరికొకరు తోడుగా ఉండేవాళ్ళు.

ఒక రోజు రాజు వాళ్ళమ్మకు వంట్లో అస్సలు బాగలేకుండా అయ్యింది. రాజు చాలా బాధపడ్డాడు. "పదరా, నేనూ వస్తాను. ఇద్దరం మీ అమ్మను డాక్టరు దగ్గరికి తీసుకెళ్దాం" అని రమేష్ ముందుకొచ్చాడు.

ఇద్దరూ కలసి రాజు వాళ్లమ్మని హాస్పిటల్‌కి తీసుకెళ్ళారు.

డాక్టర్ వైద్యం చేసిన తర్వాత డబ్బులు అడిగాడు. "ఎంత ఇమ్మంటారు సార్?" అడిగారు పిల్లలిద్దరూ. "500 రూపాయలు

ఇవ్వండి" అన్నారు డాక్టరుగారు.

మిత్రులిద్దరి ముఖాలూ వాడిపోయాయి. ఎందుకంటే వాళ్ళిద్దరి దగ్గరా కలిపి మొత్తం 150 రూపాయలే ఉన్నాయి!

కొంచెంసేపు తటపటాయించాక, వాళ్ళు ఆ డబ్బునే డాక్టరుగారికి ఇచ్చారు.

"మిగతా డబ్బుల సంగతేంటి బాబూ?" అడిగారు డాక్టరుగారు.

రమేష్ వెంటనే తన చేతికున్న ఉంగరాన్ని తీసి ఇస్తూ చెప్పాడు- "సార్! రాజు వాళ్ళు కొంచెం పేదవాళ్ళు. ప్రస్తుతానికి మా దగ్గర అన్ని డబ్బులు లేవు. యీ ఉంగరం నాది. దీన్ని మీ దగ్గర ఉంచుకోండి. రేపటికల్లా మా నాన్ననడిగి మీ డబ్బులు మీకిచ్చి, ఈ ఉంగరం తీసుకెళ్తాను" అని.

"నువ్వెవరు?"అడిగారు డాక్టరుగారు, కొంచెం ఆలోచిస్తూ.

"మేమిద్దరం ఫ్రెండ్స్ సార్!" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

డాక్టరుగారు నవ్వారు. "మీ ఫ్రెండు వాళ్లమ్మకు బాగాలేదని నీ ఉంగరాన్నిస్తున్నావన్నమాట! బాగుంది. మీ స్నేహం నాకు చాలా నచ్చింది. ఇలాగే మంచి మిత్రులలాగా ఉంటానంటే ఒక పని చేద్దాం-" అన్నారు.

"చెప్పండి సార్" అన్నారిద్దరూ.

"ఈ ఉంగరాన్నీ, డబ్బుల్నీ మీరే ఉంచుకోండి. ఈవిడకు నా తరపున వైద్యం ఉచితం. మీ స్నేహానికి నా బహుమతి, ఇది!" అంటూ డాక్టరుగారు ఉంగరాన్నీ, డబ్బుల్నీ వాళ్ల చేతుల్లోపెట్టారు!

పేరులో 'రన్' ఉంటుంది, కాని పరిగెత్తదు..ఏంటది?

జవాబు: 'హారన్'

డ్రైవింగ్ రాని డ్రైవర్ ఎవరు?

జవాబు: 'స్క్రూ-డ్రైవర్'

రక్షక భటాధికారికి లేఖ

రక్షక భటాధికారి గారికి, దినాంకం: శాలివాహన శకం ౧౯౩౪ చైత్రం ౧౨*

మదనపల్లి.

అయ్యా,

నేను నిన్న మా నాన్నగారి పాత 'తొక్కేద్విచక్రవాహనం**' పైన పాఠశాలకి వెళ్లాను. అయితే తాళం వేయకుండానే పాఠశాల ముందు పెట్టి గబగబా తరగతి గది లోనికి వెళ్లాను. ఎందుకంటే అప్పటికే చాలా ఆలస్యం అయింది. తరువాత భోజనవిరామ సమయంలో బయటికి వచ్చినప్పుడు కూడా అది అక్కడే ఉందని గమనించాను నేను.

అయితే తరగతులు ముగించుకొని బయటికి వచ్చి చూసుకుంటే అది మాయం అయిపోయింది! నేను వెంటనే అటు, ఇటు చూస్తూ అంతటా వెతికాను- కానీ నా తొక్కేద్విచక్రవాహనం కనబడలేదు. పరుగెత్తుకు వెళ్లి అక్కడ కాపలాదారు అయిన నరేంద్రన్నకి చెప్పాను- కానీ తొక్కేద్విచక్రవాహనం మీద ఎవరూ వెళ్లగా చూడలేదని చెప్పాడు అతడు. మీరు కొంచెం వెతికి- పెట్టండి.

నా తొక్కేద్విచక్ర వాహనం ఎర్రరంగులో ఉంటుంది. చాలా పురాతన కాలంది. దాని ముందు ఉండే దీపం పగిలిపోయింది. నా తొక్కే ద్విచక్రవాహనాన్ని దొంగలించడానికి అవకాశం ఉన్న వాళ్ళ పేర్లు మీకు చెబుతాను- మీరు పరిశోధించటానికి వీలుగా ఉంటుంది. వాళ్లు నరేంద్రన్న, లక్ష్మీ అక్క, జయంత్, మైత్రేష్, కార్తీక్, నందకిశోర్, యువరాజ్, విషాల్, వేద ఇంకా సమీర- ఎందుకంటే వీళ్ళందరూ దానిమీద ముందునుండే కన్నేసి ఉంచారు. దయచేసి ప్రయత్నం చేయండి. నా తొక్కేద్విచక్ర వాహనాన్ని నాకు ఇప్పించండి.

విధేయురాలు.

ప్రవీణ,

6 వతరగతి, రిషివ్యాలీ బడి,

మదనపల్లి, చిత్తూరుజిల్లా.

కఠిన పదాలకు అర్థాలు:

** *తొక్కే ద్విచక్ర వాహనం:* ***సైకిల్***

* *శాలివాహన శకం ౧౯౩౪, చైత్రం ౧౨:*

ఏప్రియల్ 1, 2012- Fools' day!



పులి ప్రార్థన

సేకరణ: వాణిశ్రీ, తొమ్మిదో తరగతి, zph స్కూలు, రామగిరి, అనంతపురం జిల్లా.
సౌజన్యం: "చిన్నారి నేస్తం", మొగ్గ, టింబక్టు కలెక్టివ్

దైవభక్తుడు ఒకడు కాలినడకన వెళ్తున్నాడు తీర్థయాత్రలకని. అలా ఒకరోజున అడవిలో నడుస్తుండగా మధ్యాహ్నం అయ్యింది. అక్కడే ఒక పెద్ద చెట్టు కనబడేసరికి, దాని నీడన చేరి కూర్చున్నాడు విశ్రాంతిగా.

అకస్మాత్తుగా ఒక పులి వచ్చి అతనికి ఎదురుగా నిల్చున్నది . దైవభక్తుడు భయంతో గజగజ వణికాడు. తప్పించుకునే అవకాశం లేదు. ఎలాగూ పులి తనను తినేస్తుంది. ఆ సమయంలో అతనికి దేవుడు గుర్తుకొచ్చాడు. "స్వామీ! ఇక నా భారం నీదే" అని కళ్ళు మూసుకొని దేవుణ్ణి ప్రార్థించడం

మొదలుపెట్టాడు.

ఎంతసేపటికీ పులి తన మీదికి దూకదే!? దేవుడు తనని కాపాడాడా?

అతనికి అనుమానం వచ్చి కళ్ళు తెరచి చూశాడు.

ఆశ్చర్యం! పులి కూడా చేతులు జోడించి కళ్ళు మూసుకొని ప్రార్థిస్తూ కనిపించింది.

అతనికి ఏమీ అర్థం కాలేదు. "దైవమహిమ! స్వామీ, నువ్వు నా చెంతే ఉన్నావు" అనుకున్నాడు.

ఇంకొంత ధైర్యం వచ్చింది. అడిగాడు-"ఓ పులీ! నేనంటే ప్రాణ భయంతో దేవుణ్ని ప్రార్థిస్తున్నాను. మరి నువ్వెందుకు ప్రార్థిస్తున్నావు?' అని.

"మీవల్లనే కదా, మా జాతి రానురాను అంతరించిపోతున్నది?! కొన్ని సంవత్సరాలకు ఇంక ఒక్క పులి కూడా ఈ భూమి మీద కనబడదు. ఇప్పుడు నా దురదృష్టం కొద్దీ నీకు ఎదురు పడ్డాను కదా, నువ్వు నన్ను చంపకూడదని దేవుణ్ని వేడుకుంటున్నాను" అన్నది పులి.

మనిషి సిగ్గుతో తల వంచుకొని నిష్క్రమించాడు అక్కడి నుండి.

నవ్వండి!

ఇల్లు భద్రం!

భార్య: వర్షం కురిసి ఇంట్లోకి నీళ్ళొచ్చాయటండీ!

వెంగళప్ప: అంతా అబద్ధం. నువ్వస్సలు నమ్మకు!

భార్య: ఎందుకండీ?!

వెంగళప్ప: ఇంటికి తాళం వేసి, తాళం చెవులు నా దగ్గరే పెట్టుకున్నాగా!

శుద్ధాత్మ!

వంశీ: అదేంట్రా! దొంగలు నన్ను కొడుతుంటే అలా పారిపోయావు?!

వెంకీ: ఎవరైనా నా స్నేహితుడిని కొట్టడం నేను చూడలేనురా!



దయ్యం డ్రాయర్

రచన: నకుల్, 6 వతరగతి, రిషివ్యాలీస్కూల్, మదనపల్లి, చిత్తూరు జిల్లా.

నా పేరు నకుల్. నేను ఆరవతరగతి చదువుతున్నాను. మాది బోర్డింగ్ స్కూల్. మా హాస్టలు రూమ్‌లో నాతో పాటు ఎనిమిది మంది ఉంటారు. మేడ మీద పెద్ద గది అది. ఆ గదికి మూడు వైపులా మూడు మూడు మంచాలు ఉంటాయి. పడమర వైపు వాకిలి, వాకిలికి ఒక ప్రక్కగా సామాన్లు ఉంచుకునే ఇంకో గది ఉంటుంది. ఎదురుగ్గా స్నానాల గదులు, టాయిలెట్స్ ఉంటాయి.

ఒక రోజు నేను స్కూలు నుండి వచ్చేప్పటికి నా మంచం మీద ఒక డ్రాయర్ పడేసి ఉంది. 'ఇది సూర్య డ్రాయర్ కదా!' అనుకుని నా మంచం ఎదురుగా ఉన్న సూర్య మంచం మీద దాన్ని పడేసి, స్నానానికి వెళ్ళాను. స్నానం నుండి

వచ్చేప్పటికి అది మళ్ళీ నా దిండు ప్రక్కగా పెట్టి ఉంది.

"అరే! సూర్యా! సూర్యా!" అని పిల్చా. సంజయ్ బయటనుండి వస్తూ "వాడింకా స్కూలు లోనే ఉన్నాడురా! అన్నాడు. "ఈ డ్రాయర్ని నువ్వేనా, నా మంచం మీద పెట్టింది?" అడిగాను.

"ఊహు! నేను పెట్టలా" అన్నాడు వాడు టాయిలెట్ లోకి పరిగెడుతూ.

"మరి, ఇది నా మంచం మీదకు ఎలా వచ్చిందబ్బా? నేను ఇప్పుడే దీన్ని సూర్య మంచం మీద పెట్టాను కదా?!" అనుకుంటూ దాన్ని తీసి స్నానాల గదుల ముందు బట్టలు ఆరేయడానికి కట్టిన కమ్మీ మీద వేశాను.

మర్నాడు ఉదయం నిద్రలేచి చూసేటప్పటికి మళ్ళీ అది నా మంచం మీద- కాళ్ళ చాపున- కనిపించింది.

కోపంగా లేచి, అందరినీ వరసగా నిద్రలేపి అడిగాను "ఇది ఎవరిదిరా? ఎవరు, దీన్ని నా మంచం మీద వేస్తున్నారు?" అని.

నిద్రమత్తులో ఉన్నారు అందరూ. నిర్లక్ష్యంగా "మాకేం తెలుసురా!" అని ఒకడూ, "నేను వేయలేదురా!" అని ఒకడూ, "చూడలేదురా!" అని ఒకడూ, "తెలియదు" అని ఒకడూ చెప్పారు.

"అయితే మరి ఇది ఎవరిదిరా?" అని అడిగాను. అందరూ 'మాదికాదంటే మాదికాదు' అన్నారు.

దాన్ని తీసుకెళ్ళి సామాన్లు ఉంచుకునే గదిలోకి కోపంగా విసిరేశాను. మధ్యాహ్నం డైనింగ్ హాల్‌లో భోజనం చేసి గదిలోకి రాగానే అది మంచం మీద ఉందేమోనని చూశాను, లేదు.

సామాన్ల గదిలోకి వెళ్ళి చూస్తే అక్కడా లేదు!

'మరేమయి ఉంటుంది? క్రింద గదుల్లో వాళ్ళదేమో! తీసుకున్నారేమోలే!' అనుకుని కాసేపు విశ్రాంతి తీసుకుని స్కూలుకి వెళ్ళాను.

సాయంత్రం స్కూలు నుండి వచ్చి స్నానం చేసి బట్టల కోసం నా అలమర తెరిచాను. బట్టల మీద చక్కగా మడత పెట్టి ఉన్న ఆ డ్రాయర్ ని చూడగానే నా కళ్ళు పెద్దవయ్యాయి.

బాగా కోపం వచ్చింది. నా స్నేహితుల వైపు చూస్తూ "ఎవరు పెడుతున్నారురా దీన్ని, నా మంచం మీద, నా అలమరాలో?! ఇది నాది కాదు!"అని అరిచాను కోపంగా. నా కోపాన్ని చూసి అందరూ తెల్లబోయారు. అందరూ ఒట్టేసి చెప్పారు "మేం కాదంటే మేంకాద"ని.

"మరి ఎవరు వేస్తున్నారురా, వీడి మంచం మీద?!" అన్నాడు సూర్య.

"దీన్లో దయ్యం ఏమైనా ఉందేమోరా" అన్నాడు రాజుగాడు. వాడెప్పుడూ దయ్యం కథల పుస్తకాలు చదువుతుంటాడు. వాడు అట్లా అనగానే మాకందరికీ నిజంగానే భయమేసింది. డ్రాయర్ని కర్రతో తీసి, మేడ మీద నుండి క్రిందకు విసిరి వేశాము.

ఆ రాత్రి అందరం భయంగా ఉందంటూ మంచాలన్నీ దగ్గరకు చేర్చుకుని పడుకున్నాము.

తెల్లవారి లేచి చూసేటప్పటికి మళ్ళీ అది నా మంచం మీద పడి ఉంది! భయంతో పెద్దగా కేక వేశాను.

అందరూ కూడా దాన్ని చూసి అరుస్తూ క్రింద హాస్టల్‌కి ప్రక్కనే ఉండే వార్డెన్ ఇంట్లోకి పరిగెత్తారు. జరిగిందంతా వార్డెన్‌కి చెప్పాము అందరమూ.

ఈ హడావుడికి క్రింద గదిలో ఉండే తొమ్మిది మంది కూడా వార్డెన్ ఇంట్లోకి వచ్చారు.

మా వార్డెన్ వాళ్ళల్లో ఒకడిని పంపి క్రిందినుండి డ్రాయర్ తెప్పించింది.

మా గదిలో ఉండే తొమ్మిది మందిమీ దాని వైపు భయంగా చూడసాగాము.

"ఎవరిది ఇది?" అని అడగ్గానే, క్రింద గదిలో ఉండే నిర్మాణ్ ముందుకొచ్చాడు- "ఇది నాదే మేడం! దీని కోసం రెండు రోజులుగా వెతుకుతున్నాను!" అన్నాడు తాపీగా.

"మరి దీన్ని నకుల్ మంచం మీద ఎవరు పెడుతున్నారు?" అంది ఆమె.

"తెలియదు - మేం పెట్టలేదు " అని అరిచారు అందరూ గోలగోలగా.

"రమా! రమా!" అంటూ మా స్వీపర్ ని పిలిచింది వార్డెన్.

చీరను పైకి దోపుకుని, చేత్తో చీపురుతో వార్డెన్ గదికి వచ్చింది, మా స్వీపర్ రమాదేవి.

వార్డెన్ చేతిలో ఉన్న డ్రాయరుని చూసి ఆమె "చూడమ్మా! ఈ నకుల్ బాబు - దీన్ని ఎక్కడంటే అక్కడ పడేస్తున్నాడు! నేను భద్రంగా పెట్టనూ-ఆ బాబు పారేయనూ! మీకు చెబ్దామనుకుంటూనే మర్చిపోతున్నా పనిలోపడి !" అంది తిప్పుకుంటూ.

వార్డెన్‌తో సహా అందరూ నా వైపు చూసి నవ్వసాగారు.

నవ్వు ఆపుకుంటూ "ఇది నకుల్ దని ఎందుకనుకున్నావు, రమక్కా?" అంది వార్డెన్ మా స్వీపర్ వైపు చూస్తూ.

ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాని రమక్క "వస్తువులన్నీ నిర్లక్ష్యంగా పారేసుకునేది ఈ బాబేగా అమ్మా!" అంది.

నవ్వటం ఆపేసి సూటిగా నా కళ్ళల్లోకి చూసింది వార్డెన్- 'ఇంకెప్పుడూ నిర్లక్ష్యంగా వస్తువులను పడేయను. భద్రంగా పెట్టుకుంటాను అన్నట్లు తల దించుకున్నాను.



"మొత్తం మీద దీనిలో దయ్యం లేదనైతే అర్థమైందిగా, అందరికీ?!" అన్నది వార్డెన్, నవ్వుతూ.

"అర్థమైంది అర్థమైంది" అంటూ అందరం గోలగోలగా బయటికి పరుగు తీశాం.

"రుచిలేని కారం ఏంటి?"	" ఆకారం "
ఎగ్జామినర్ దిద్దని పేపర్?	" న్యూస్‌పేపర్ "



పారని యుక్తి

రచన: పేరు రాయని పాప, 8 వ తరగతి, Z.P.హైస్కూలు, పెద్దపసుపుల, కడప జిల్లా.

అడవిలో ఒక సింహం ఉండేది. అది కొంచెం ముసలిదైంది. వేటాడే ఓపిక తగ్గిపోయింది దానికి. రాజునన్న అహంకారం మాత్రం నిలచి ఉన్నది. దాంతో అది జంతువుల సమావేశం ఒకటి ఏర్పాటు చేసింది. "నన్ను మీ రాజుగా కొనసాగనిస్తున్నందుకు ధన్యవాదం. ఇక నుండి నేను మాంసాహారాన్ని ముట్టను. వేటాడను. సాధు జీవితం గడపాలనుకుంటున్నాను" అంటూ సభను ముగించింది. జంతువులన్నీ చాలా సంతోషపడ్డాయి.

"ఇక మీద మనం అడవిలో నిర్భయంగా తిరగొచ్చు" అనుకున్నాయి.

గుహకు చేరగానే సింహరాజు నక్కమంత్రిని పిలిచింది. "అడవిలో ఒంటరిగా కనబడ్డ జంతువును దేన్నైనా నేను పిలుస్తున్నానని చెప్పి

తీసుకురా, బాగా ఆకలిగా ఉంది. త్వరగారా!" అంటూ దాన్ని అడవిలోకి పంపింది.

కొద్ది దూరం అలా పోగానే నక్కకు ఒక జింక కనబడింది. "ఏం, జింకా! బాగున్నావా?" అంది నక్క.

"ఏదో, ఇలా ఉన్నాం" అంది జింక.

"ఏమైనా కష్టాలుంటే సింహరాజుకు విన్నవించుకో, ఇప్పుడైతే ఆయన కొంచెం విశ్రాంతిగా ఉన్నారు" అని దానికి మాయమాటలు చెప్పి, దాన్ని వెంటబెట్టుకొచ్చింది సింహం గుహ దగ్గరకి. గుహ బయట నిలబడి 'రాజా'అని పిలవగానే సింహం బయటికి వచ్చి క్షణాల్లో దాన్ని చంపేసి గుహలోకి ఈడ్చుకుపోయింది. అది తినేసి వదిలిపెట్టిన జింక ముక్కల్ని నక్క తిన్నది- మెల్లగా చప్పరించుకుంటూ.

అట్లా రోజూ ఏదో ఒక జంతువును చంపి తినటం మొదలుపెట్టాయి సింహం-నక్క.

అడవిలోని ముఖ్యమైన జంతువులన్నీ ఒక్కటొక్కటిగా కనబడటం మానేస్తున్నాయి. దాంతో ఎలుగుబంటికి, ఏనుగుకు కొంచెంగా అనుమానం వచ్చింది. అవి రెండూ ఒకనాడు సాయంత్రం సింహం గుహకు ఎదురుగా ఉన్న పెద్ద బండ వెనక దాక్కున్నై. నక్క గుహలోంచి బయటికి వెళ్ళటం, కొద్ది సేపటికి ఒక జంతువును వెంటబెట్టుకు రావడం, సింహం చంపడం, అవి రెండూ తినడం- మొత్తం చూసినై.



"అబ్బ సింహమూ! ఇంత మోసమా! నీకు బుద్ధి చెబుతాం ఆగు" అని దీనికి పరిష్కారం ఆలోచించిపెట్టుకున్నై. మరునాడు గుహలోంచి బయటికి రాగానే నక్కకు

ఎదురైంది ఎలుగుబంటి. "ఇవాల్టికి ఇదే మనకు ఆహారం" అనుకున్న నక్క దాన్ని ఆప్యాయంగా పలకరించింది. మాయ-మాటలు చెప్పి, దాన్ని సింహం దగ్గరికి తీసుకెళ్ళాలనుకుంది.

కానీ ఎలుగుబంటి ముందుకు దూకి నక్కనే చంపేసింది గభాలున. అప్పటికే విషపు ఆకుల కట్టనొకదాన్ని తీసుకొచ్చి ప్రక్కన నిలుచున్నది ఏనుగు. రెండూ కలిసి విషపు ఆకులను పిండినై. ఆ రసాన్ని నక్క కడుపునిండా పోసి, దాన్ని తీసుకెళ్ళి సింహం గుహ దగ్గర పడేసినై. కొద్దిసేపటికి ఇక ఆకలికి ఆగలేక పోయింది సింహం. మెల్లగా నడచుకొంటూ బయటికి వచ్చింది. ఎదురుగుండా కనబడింది నక్క శరీరం! ఆకలిగొని ఉన్న సింహం ఉచితానుచితాలు మర్చిపోయింది. దాని ఆలోచన కూడా బాగా మందగించింది. నక్క శవాన్నే గుహలోకి గుహలోకి ఈడ్చుకు పోయి తిన్నది.

ఇంకేముంది, ఎలుగుబంటి-ఏనుగుల ఉపాయం పారింది. కొంత సేపటికి సింహం కూడా చనిపోయింది.

ఆనాటినుంచి అడవిలోని జంతువులన్నీ సంతోషంగా జీవించినై.

మంచి పద్యం

కోపమునను ఘనత కొంచెమైపోవును
కోపమునను మిగుల గోడు చెందు
కోపమడచెనేని కోరికలీడేరు
విశ్వదాభిరామ వినుర వేమ!

కోపం వల్ల మన గొప్పతనం తగ్గిపోతుంది. కోపం వల్లనే మనం ఎక్కువ దు:ఖానికి లోను కావలసి వస్తుంది. అట్లాంటి కోపాన్ని గనక అదుపులోకి తెచ్చుకున్నట్లయితే కోరికలన్నీ నెరవేరతాయి. అంటే మన కోపాన్ని మించిన శత్రువు వేరే ఏదీ లేదనమాట.

తుంటరి పని

కేకు బొమ్మకు స్పందన

రచన: ఏ.యస్. నందన, 5 వతరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.





రామాపురంలో సుమిత్ర, నాగప్ప అనే దంపతులు ఇద్దరు ఉండేవారు. వాళ్ల కొడుకు చరణ్ చాలా తుంటరి వాడు. వాడంటే సుమిత్రకు, నాగప్పకు కూడా చాలా ఇష్టం. వాళ్ళు చాలా ఎక్కువ గారాబం చేయటంతో వాడి తుంటరితనం మరీ ఎక్కువైపోయింది.

ఒకసారి చరణ్ పుట్టినరోజు వచ్చింది. తన పుట్టిన రోజు కనుక తను 'ఒక కేకు కొనాల్సిందే' అనుకున్నాడు చరణ్- కానీ వాడి దగ్గర డబ్బులు లేవు!

తుంటరివాడు కదా, అందుకని వాడేం చేశాడంటే, నేరుగా కేకు అమ్మే అంగడి దగ్గరికి వెళ్ళాడు. "ఒక కేకు ఇవ్వండి" అన్నాడు దర్జాగా. అంగడిలో వాళ్లకు వీడి దగ్గర డబ్బులు లేవని తెలీదు. అందుకని వాళ్ళు కేకును వీడి చేతికి ఇచ్చారు. అంతే- వాడు దానిని తీసుకొని, ఇక డబ్బులు ఇవ్వకుండా పరుగెత్తాడు.

దుకాణం వాళ్ళు వాడి వెంట పరుగెత్తి వాడి అంగీ పట్టుకున్నారు. అయినా వాడు ఆగలేదు. వాడి అంగీ చినిగిపోయి పీలికలైపోయింది. అయినా వాడు తువ్వాల కప్పుకొని పరుగెత్తాడు! వాడు అట్లా పరుగెత్తుతుంటే ఒక చెప్పు ఊడి పోయింది. అయినా వాడు అలాగే పరుగెత్తి, అంగడి

వాళ్లనుండి తప్పించుకునేందుకని అడవిలోకి పారిపోయాడు.

ఇంక ఎంత దూరమని వెంబడిస్తారు, అంగడి వాళ్ళు? "ఇంక పట్టుకోలేం" అని వదిలేసి వెనక్కి మళ్ళారు.

ఆ సమయంలో అంగడాయన తన మనసులో గట్టిగా అనుకున్నాడు- "ఒరేయ్! నువ్వు నా వస్తువును దొంగతనం చేశావురా! దానిమీద నీకు ఏలాంటి అధికారమూ లేదు. కాబట్టి అది నీకూ దక్కదు, చూస్తూండు!" అని.

ఈ మాటలు విన్నారు, ఆ అడవిలో ఉన్న వన దేవతలు కొందరు.

వాళ్ళు అనుకున్నారు "అరే! వీడు చేస్తున్నది తప్పు పని కదా, ఇలా ఒకసారి వాడికి కేకు దొరికిందంటే వీడు మళ్ళీ మళ్ళీ ఇలాంటి తప్పుడు పనులే చేస్తాడు. వీడిని మంచి మార్గంలోకి తేవాలి" అని, వాళ్ళు ఇట్లా చెయ్యి ఊపారు-

అంతే, ఆ కేకు చిన్న చిన్నగా అయిపోవటం మొదలుపెట్టింది!

"అరే, కేకు చిన్నగా ఐపోతోందే" అని చరణ్ గబగబా దాన్ని నేలమీద పెట్టాడు. క్యాండిల్ అంటిద్దామని అగ్గిపెట్టె కోసం చూశాడు హడావిడిగా. అదెక్కడుంది, ఎప్పుడో మాయం!

ఇంక అప్పుడు చరణ్ ఇంకొంచెం గందరగోళ పడి అనుకున్నాడు- "క్యాండిల్ తీసేసి తినేస్తాను- దానిదేముందిలే" అని. అట్లా అనుకొని, వాడు క్యాండిల్‌ని పీకి పారేశాడు.

అయితే ఆ సరికి కేకు మరీ చిన్నగా అయిపోయింది. వాడు దాని మీద చెయ్యిపెట్టే సరికి అది పూర్తిగా మాయమే అయిపోయింది!

అట్లా ఎందుకయిందో కూడా అర్థం కాని చరణ్ బిక్క ముఖం వేశాడు. దిక్కులు చూసి అటునుండి లేచి వచ్చాడు.

మిత్రులారా! వాడిలాగా ఆశకు పోయి ఏనాడూ తప్పుడు పనులు చేయకూడదు మనం ఎవ్వరమూ- సరేనా?

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

ఈ బొమ్మను చూడండి.. ఎవరితను?!@$!



ఎవరో దొంగ కాబోలు! లేకపోతే జరిగిన నేరాన్ని దేన్నైనా పరిశోధిస్తున్న పోలీసా? గోడమీద ఏదో నోటీసు అంటించినట్లున్నారే, దేన్ని గురించో? ఇతను ఆ నోటీసును చదివాడంటారా? గోడని చూస్తే, మరి బాగా పాతది లాగా ఉంది. వానకి చాలా నానినట్లుంది కూడాను. మీకు తెలుసా, దీని కథ? తెలిస్తే మాకు రాసి పంపండి. బాగున్న కథని రెండు నెలల తర్వాత కొత్తపల్లిలో ప్రచురిస్తాం. ఒక కాపీ మీకూ అందిస్తాం!

మీ కథలు పంపాల్సిన చిరునామా:

కొత్తపల్లి బృందం, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా-515101

షికారులో నంబర్లు

రచన: శ్రీమతి రాధ మండువ, రిషివ్యాలీ స్కూలు, మదనపల్లి, చిత్తూరు జిల్లా.



"తమ్ముడూ! షికారుకి వెళదామా?" అంది శీతల.

"వెళదాం! వెళదాం!" గంతులు వేశాడు రాము.

ఇద్దరూ బయలుదేరారు.



"తమ్ముడూ ! అదిగో చూడు - అమ్మ ఆవు. దానికొక దూడ. ఆ పిల్లకు గడ్డి తినటం నేర్పిస్తోంది తల్లి" అంది శీతల.

"భలే! భలే! ఆవు దూడ ఎంత బావుందో!" అన్నాడు రాము సంతోషంగా.

"తమ్ముడూ! అదిగో కాకి. తన ఇద్దరు పిల్లలకీ ఎగరడం నేర్పిస్తోంది" చెప్పింది శీతల, చెయ్యెత్తి పైకి చూపిస్తూ.

"ఆయ్! భలే ఉన్నాయి పిల్ల కాకులు నల్లగా!" అన్నాడు రాము, పైకి చూస్తూ.





"ముందు చూసి నడువు. అదిగో చెరువు. ఒడ్డున ఉన్న ఆ కప్ప చూడు తన ముగ్గురు పిల్లలకీ గెంతడం నేర్పిస్తోంది" అంది శీతల, తమ్ముడి భుజంపైన చెయ్యివేసి నడిపిస్తూ.

చెరువు దగ్గరకి వేగంగా నడిచి "బుజ్జి కప్పలు భలే గెంతుతున్నాయి. నేను కూడా వాటిలాగే గెంతుతా" అన్నాడు రాము.



" సరే! తర్వాత గెంతుదువుగాని. ఇటు చూడు- చేప తన నలుగురు పిల్లలకీ ఎలా ఈదాలో నేర్పిస్తోంది" అంది శీతల.

"భలే! అబ్బ! చేప పిల్లలు ఎంత ముద్దుగా ఉన్నాయో!" అన్నాడు రాము.

"సరే! దా! ఆలస్యమవుతోంది. ఇంటికి వెళదాం! " అంది శీతల.

ఇద్దరూ మళ్ళీ ఇంటి దారి పట్టారు.



"అక్కా! చూడు - చూడు - గాజు పురుగులు!" అన్నాడు రాము.


"ఔను! ఈ అమ్మ గాజు పురుగు తన ఐదుగురు పిల్లలకీ పాకడం నేర్పిస్తోంది!" అంది శీతల.

వాటినే చూస్తూ కూర్చున్న తమ్ముడితో "పద, ఇంటికి వెళదాం. అమ్మ ఎదురు చూస్తుంటుంది" అంది వాడిని లేపుతూ.



ఇద్దరూ ఇంటికి చేరారు. "అమ్మా! అమ్మా! మరే! నేను ఇప్పుడు ఒక ఆవు పిల్లని, ఇద్దరు కాకి పిల్లలను, ముగ్గురు కప్ప పిల్లలను, నలుగురు చేప పిల్లలను, ఐదుగురు గాజు పురుగు పిల్లలను చూశాను" అన్నాడు రాము అమ్మ చెయ్యిని ఊపేస్తూ.

వాడి మాటలకు అమ్మ, శీతల పక పకా నవ్వారు.



"ఎందుకు నవ్వుతారు?" అన్నాడు రాము బుంగమూతి పెట్టి.

"వస్తువుల పేర్లు, జంతువుల పేర్లు చెప్పినపుడు ఒక ఆవు, రెండు కాకులు, మూడు కప్పలు, నాలుగు చేపలు, ఐదు గాజు పురుగులు - ఇలా అనాలి " అంది అమ్మ వాడిని ఎత్తుకుని ముద్దు పెట్టుకుని. "ఓహో! అలాగా!" అన్నాడు వాడు.



గుణపాఠం



రచన: కుడుం.వెంకటరమణ, ఉపాధ్యాయులు, యంపిపి స్కూల్, మొలకవారిపల్లి, అంగళ్ళు, కురబలకోట, చిత్తూరు జిల్లా.

బూర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివే రాజేష్ స్వతహాగా తెలివైన పిల్లవాడు. అందువల్లనేనేమో, వాడిలో గర్వం పాలు కూడా ఎక్కువ. మామూలుగా తరగతిలో అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకునేవాడు వాడు. తరగతి పరీక్షలన్నింటిలో కూడా చక చకా సమాధానాలు రాసేవాడు. ఉపాధ్యాయులు అందరూ సహజంగానే రాజేష్‌ను మెచ్చుకొనేవారు. దాంతో వాడు మరింత ఉబ్బిపోయి, తోటి విద్యార్థుల సామర్థ్యాలను చిన్నచూపు చూడటం కూడా మొదలు పెట్టాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. రాజేష్ 5 వతరగతికి చేరుకున్నాడు. 'తనే తెలివైన వాడు' అన్న గర్వం నిండింది వాడిలో. దాంతో

ఇప్పుడు వాడు తరగతి పుస్తకాలను కూడా సరిగా చదవటం లేదు. ఉపాధ్యాయులు కూడా వాడిని ఈ విషయమై ఒకటికి రెండుసార్లు హెచ్చరించారు- 'సరిగా చదవక పోతే నష్టపోతావురా' అని. వారి మాటల్ని రాజేష్ ఏమాత్రం పట్టించుకోలేదు.

ఇంతలో గురుకుల పాఠశాలలో 6 వతరగతి ప్రవేశానికి ప్రకటన వచ్చింది. పాఠశాలలో బాగా చదివే వాళ్ళంతా దానికి దరఖాస్తు చేసు కున్నారు.గురుకులపాఠశాలలో చదువులు బాగుంటాయి.అనుభవజ్ఞులైన అధ్యాపకు

లుంటారు. వసతి, ఖర్చులు మొత్తం ప్రభుత్వం వారు చూసుకుంటారు! గురుకుల పాఠశాలలో ప్రవేశం దొరకటం కూడా గౌరవప్రదమే. దరఖాస్తు చేసిన పిల్లలందరూ కష్టపడి చదవసాగారు.

పరీక్ష రాసేసి బయటికి వచ్చాక రాజేష్ గొప్పలు చెప్పుకోవడం వెంకటేష్, పవన్‌ల కంటబడింది. "గురుకుల పాఠశాలలో నాకు తప్పక సీటు వస్తుంది. ఇంక ఎవరికీ కూడా సీటురాదు" అంటున్నాడు రాజేష్.

ఐదో తరగతిలో ఉన్న విద్యార్థులందరిలోనూ సున్నిత హృదయులు వెంకటేష్, పవన్. ఇద్దరూ చక్కగా, నిలకడగా చదివేవాళ్ళు. రాజేష్ మాటలు విని వాళ్ళు చాలా ఆందోళనకు గురయ్యారు. అయితే "ఫలితాలు ఎలా ఉంటాయో ఎవరూ చెప్పలేరు- బాగా చదివి, పరీక్షలు చక్కగా రాయటం వరకూ మన చేతుల్లో ఉంది. మీరు బాగానే రాశారు కదా, మీకూ సీటు రావచ్చులే. ఆందోళన పడకండి." అని ఉపాధ్యాయులు వాళ్ళను ఊరడించి పంపారు.

కొద్దిరోజుల్లోనే గురుకుల పాఠశాల ఫలితాలు వెలువడ్డాయి. వెంకటేష్, పవన్‌లకు ప్రవేశం వచ్చింది. గర్వంతో విర్రవీగే రాజేష్ మాత్రం సెలెక్టు కాలేదు.

అందరూ వెంకటేష్, పవన్‌లను అభినం-దించారు. చిన్నబోయిన రాజేష్‌ను ఉపాధ్యాయులు ఊరడించారు-"ఫర్వాలేదులే రాజేష్, ఐదో తరగతిలో నువ్వు అంత బాగా చదవలేదుగా?! పై తరగతుల్లో బాగా చదువుదువులే, ఏం కాదు!" అన్నారు.



కొబ్బరికాయ బండారం!

రచన: శ్రీ యస్. శంకర శివ రావు, ఇంద్రజాలికులు/ఉపాధ్యాయులు, యంపియుపియస్, భద్రాపురం, కనగానపల్లి మండలం, అనంతపురం జిల్లా.

పదవ తరగతి పరీక్షలు బాగా రాసింది శిల్ప. పేరున్న కాలేజీలో చేరుస్తానన్నాడు నాన్న. శిల్ప చాలా సంతోషంగా ఉంది. తన స్నేహితురాళ్ళు- వెన్నెల, మౌనికలకు ఈ సంగతి చెప్పింది. ముగ్గురూ కలిసి ఎక్కడికైనా వెళ్ళి వద్దామనుకున్నారు.

'కొండమీద స్వామీజీ వచ్చారంట- వెళ్ళి వద్దామా?' అంది వెన్నెల. 'అమ్మను అడిగి పోదాం' అంది శిల్ప. అమ్మను అడిగితే 'తొందరగా పోయి వచ్చేయండి'- అని పూజా సామగ్రి కోసం కొన్ని డబ్బులిచ్చింది.

ఊరి దగ్గర కొండమీద స్వామీజీ వచ్చి నెలరోజులు కావస్తోంది. జాతరను తలపించే జనం. కొండ క్రింద టెంకాయలు, పూలు

అమ్మే అంగళ్ళు వెలిశాయి. రెండొందల మెట్లెక్కి కొండపైకి వెళ్ళాలి- స్వాములవారిని చూడాలంటే.

మెట్లెక్కబోతున్న పిల్లల్ని పిలిచింది పూలమ్మే ఆవిడ- "స్వామీజీకి పూలు పండ్లు తీసుకుపోండమ్మా!" అని. శిల్ప ఒక కొబ్బరికాయ, పూజాసామగ్రి ఇమ్మన్నది. "మంచివి ఇమ్మంటావామ్మా?" అడిగింది పూలామె.



"మంచివే ఇవ్వు; చెడ్డవి దేనికి?!" నవ్వారు మిత్రులు.

ఆవిడ కూడా నవ్వుతూ టెంకాయ, పూలు ఇచ్చింది- చిల్లర వెనక్కి ఇస్తూ "ఏం పేరు?" అడిగింది.

"శిల్ప".

"ఏం కావాలనుకుంటున్నావ్?"

"డాక్టరు" జవాబిచ్చింది శిల్ప.

ముగ్గురూ పైకి వెళ్ళి క్యూలో నిలబడ్డారు. తమ వంతు వచ్చేసరికి రెండు గంటలకు పైగా పట్టింది. ఎదుట నిలచి స్వాముల వారికి నమస్కరించారు.

అకస్మాత్తుగా స్వామి కళ్ళు తెరచి 'శిల్పా! అమ్మవారికి టెంకాయ సమర్పించు తల్లీ!" అన్నాడు!

శిల్ప నివ్వెరపోయింది.

ఆమె తేరుకునేలోపు స్వామీజీ అడిగాడు- "డాక్టరు కావాలనుకుంటున్నావు కదూ!?" అని.

మౌనంగా తల ఊపింది శిల్ప.

"అయితే నేను చెప్పింది చెయ్యి. ముందు టెంకాయ కొట్టు, అమ్మవారి ముందు!" అన్నాడు స్వామీజీ.

టెంకాయ కొట్టింది శిల్ప.

ఆశ్చర్యం! టెంకాయలోంచి నీళ్ళు రాలేదు! మల్లెపూలు రాలాయి!

మరుక్షణం అక్కడ చేరిన వాళ్ళంతా "స్వామి వాక్కు బ్రహ్మ వాక్కు!" అని భజన మొదలు పెట్టారు బిగ్గరగా.



ఒక శిష్యుడు ముందుకొచ్చి "తల్లీ! స్వామి వారికి దక్షిణ ఏదైనా సమర్పించుకో! నీ పంట పండింది!" అన్నాడు.

చిల్లర ఇవ్వబోయింది శిల్ప.

"అదికాదు! నీ మెడలోని బంగారు గొలుసు ఇవ్వు. అమ్మవారికి బంగారం ప్రీతిపాత్రం. అది సమర్పిస్తే నీ కోరిక తప్పక ఫలిస్తుంది" అన్నారు అక్కడ చేరిన వాళ్ళెవరో.

స్నేహితులు కూడా వంత పాడారు. ఇక వెనకా ముందు ఆలోచించకుండా గొలుసు ఇచ్చి ఇంటికొచ్చింది శిల్ప.

బోసిపోయిన మెడను చూసీ చూడగానే 'గొలుసేదే?' అని అడిగింది అమ్మ.

'స్వామీజీకి సమర్పించాను' అన్నది శిల్ప.

అమ్మ ఏడుపు ముఖం పెట్టింది. నాన్న చిందులేశాడు. శిల్ప ఏడుపు లంకించుకున్నది. స్నేహితులు అంతకు ముందే మాయమయ్యారు!

పట్నంలో కాలేజీ చదువులు చదువుతున్న 'డౌసు' అన్న అదే సమయానికి ఇంటికొచ్చాడు. పరుగున పోయి అన్నను పట్టుకొని ఏడ్చింది శిల్ప. అమ్మ అంతా వివరించింది.

డౌసు నవ్వాడు- "కొబ్బరి కాయలోంచి పూలు రాలితే మహాత్యం అనుకున్నావు కదూ!" అన్నాడు.

"అవును" అన్నట్లు తల ఊపింది శిల్ప.

"నీ పేరు కూడా చెప్పేసేసరికి ఇక నోరెత్తలేకపోయావు!" నవ్వాడు డౌసు. "అదంతా గారడీ శిల్పా; ఒట్టి మ్యాజిక్ అది! మాయ మంత్రాలు కాదు- ఆ స్వామి బలే మోసగాడు. అంతెందుకు; కావాలంటే నువ్వూ తెప్పించగలవు, కొబ్బరి కాయలోంచి పూలు!" అన్నాడు.



"అదెలా?" అని ప్రశ్నమార్కు మొహంపెట్టింది శిల్ప.

నేను నేర్పుతాను ఆగు- "అమ్మా! ఒక కొబ్బరికాయ, కొన్ని మల్లెపూలు ఇవ్వు- అట్లాగే ఒక స్ట్రా కూడా!" అని అడిగి తీసుకున్నాడు డౌసు.

"ముందు టెంకాయను ఒలచాలి. జుట్టు కొంచెం ఎక్కువ ఉండేట్లు వదలాలి"

శిల్ప టెంకాయను వలిచి తీసుకు వచ్చింది.

"బాగుంది- తెలుసుగా, టెంకాయకు మూడు కన్నులు ఉంటాయి- వీటిని ఒత్తి చూడాలి. ఒక కన్ను పొర పలచగా ఉంటుంది- ఎందుకో తెలుసా? మొక్క మొలకెత్తి ఆ కన్నులోంచే బయటికి వస్తుందన్నమాట!- దాన్ని గుర్తుపట్టాలి" చెప్పాడు డౌసు.

"దొరికింది- ఈ కన్నే గద! కొంచెం పలచగా ఉంది" చెప్పింది శిల్ప.

"అవును- అదే. ఇప్పుడు దాని మీద ఉన్న జుట్టును కొంచెం ప్రక్కకు నెట్టి, జుట్టు ఊడకుండా ఆ కన్నుకు రంధ్రం చెయ్యాలి-" శిల్ప అప్పటికే రంధ్రం చేసేసింది ఓ మేకుతో.

"ఇప్పుడేం చెయ్యాలో తెలుసుగా? ముందు ఎంచక్కా స్ట్రా పెట్టి కొబ్బరి నీళ్ళు త్రాగెయ్యాలి! చాలా బాగుంటై, తియ్యగా- నాకు టెంకాయ

నీళ్లంటే చాలా ఇష్టం!" నవ్వాడు డౌను.

ఇద్దరూ తలా కొన్ని నీళ్ళు త్రాగారు.

"ఊఁ..ఇప్పుడు మల్లెపూలను రంధ్రంలోంచి దూర్చాలి, కొబ్బరికాయలోకి. ఎన్ని కావాలనుకుంటే అన్ని దూర్చచ్చు.." ఇద్దరూ కలిసి చాలా పూలను టెంకాయలోకి దూర్చారు.

"కానీ..నేను తీసుకెళ్ళిన కొబ్బరికాయకు రంధ్రం లేదు!" అంది శిల్ప.

"దీనికీ ఉండదు- చూడు- కొంచెం కర్పూరం ఇవ్వమ్మా!" అమ్మ కర్పూరం తెచ్చి ఇచ్చింది.

"దీంతో రంధ్రాన్ని మూసేస్తాం!..ఇలాగ" నవ్వుతూ, కొబ్బరికాయ పైనున్న జుట్టును రంధ్రం పైకి జరిపి, సర్దేశాడు డౌను.

"చూడు ఈ కొబ్బరి కాయకు రంధ్రం ఏముంది?!"

శిల్ప కొబ్బరి కాయను చేత పట్టుకొని చూసింది. 'నిజమే..తేడా ఏమీ కనబడటం లేదు.'

"ఇప్పుడు ఈ కొబ్బరికాయను కొడితే నీళ్ళెందుకు వస్తాయి? పూలే రాలతాయి గానీ!!" నవ్వాడు డౌను. అమ్మ కూడా నవ్వేసింది.

"కానీ మరి, ఆ టెంకాయను స్వామీజీ ఇవ్వలేదు నాకు!" అనుమానంగా అంది శిల్ప.

"అవును చెల్లీ, ఇలాంటి టెంకాయల్ని టెంకాయలు అమ్మేవాళ్లద్వారానే అమ్మిస్తారు. స్పెషల్ కొబ్బరికాయని అమ్మినప్పుడే దాన్ని కొన్నవారి పేరును, కోరికలను కనుక్కొని, సెల్‌ఫోన్ ద్వారా మెసేజ్ చేసేది ఎంత పని!? స్వాముల వారు తలచుకొంటే ఇలాంటి ఏజంట్లకు ఏం కొదవ?!" అన్నాడు డౌను.

"మరి, మొన్న ఎవరి టెంకాయలోంచో పసుపు నీళ్ళు వచ్చాయటనే, అది ఎలా సాధ్యం?" అడిగింది శిల్ప.

"పసుపు కుంకుమ నీళ్ళను సిరెంజిలో తీసుకొని, కొబ్బరికాయ కన్నుకు ఇంజక్షన్ చేయటం! అంతే!" నవ్వారు అందరూ.

"మరి ఇప్పుడేం చేద్దాం?" అంది శిల్ప తన బంగారుగొలుసును తలచుకొని చిన్నబోతూ. "ఏముంది, పదండి పోలీస్ స్టేషన్‌కు!" అని

డొాసు బయటికి దారి తీశాడు.

"సారీ నాన్నా, ఇప్పుడు ఏమీ చెయ్యలేము. మీరు ఇట్లా రావటం చూసి స్వామీజీ అట్లా జెండా పీకేశారు- కాదు కాదు, 'అత్యవసరంగా సమాధిస్థులయ్యారు'. -అయినా బాబాలు చెబితే ఎవ్వరూ డాక్టరు కారమ్మా, కష్టపడి చదివి డాక్టర్లవ్వాలి!" అన్నారు యస్పీగారు, సంగతి కనుక్కొని.

ఆనాటినుండీ శిల్ప నేర్చుకున్నది- 'ప్రపంచంలో గమనించిన ప్రతి విషయాన్నీ 'ఎందుకు, ఏమిటి, ఎలా?' అని ప్రశ్నించటం. మీరూ ప్రశ్నిస్తారు కదూ? ఊరికే మోసపోకండి మరి, శిల్ప మాదిరి!

నవ్వండి!

తిరగబడ్డ తర్కం!

పెద్దాయన: ఒరేయ్, ప్రతిసారీ ఇలా ఓడిపోతూనే ఉంటావేమి, నీకు సిగ్గు వెయ్యదా?

వెంగళప్ప: విజయంలో కన్నా ఓటమిలోనే ఎక్కువ నేర్చుకోవచ్చని మా తాత ఎన్నిసార్లు చెప్పాడో లెక్కలేదు పెద్దయ్యా! అందుకే నేను ఎప్పుడూ ఓడిపోతుంటాను, అట్లా ఎప్పుడూ నేర్చుకోవచ్చని!

తెలివైన ధర్మం!

బిచ్చగాడు: అమ్మా ధర్మం చెయ్యమ్మా! పేదవాడికి ఏదైనా దానంచెయ్యమ్మా!

పార్వతి: ఏమయ్యా, ఎప్పుడంటే అప్పుడు వచ్చేదేనా? నీకు వేళా పాళా లేదా?

బిచ్చగాడు: నాకు ఓ వాచీ ధర్మం చెయ్యండమ్మా, రేపటినుండీ సరైన టైంకి వస్తా!



చీకటి

అనంతపురం జిల్లాలో చీకటిని 'మబ్బు' అని పిలుస్తారు. ఏమీ అర్థం కాకుండా, ఏమీ తెలీకుండా ఉండటాన్ని కూడా 'మబ్బు' అనే అంటారు. "మబ్బుగా ఉండకూడదు-తెలివిగా ఉండాలి"- లేకపోతే కష్టమే. ఈ కథ చదివితే మీకే అర్థం అవుతుంది- అట్లాఎందుకంటారో...

రచన: నారాయణ, కొత్తపల్లిబృందం.

గీత వాళ్లింట్లో కరెంటు పోయింది. ఎందుకు? ఏమో,తెలీదు. కరెంటు పోయిందంతే.

మరి మిగిలిన వాళ్ల ఇళ్లలో? కరెంటు ఉంది!

అయితే యీ విషయం గీతకు, వాళ్లమ్మకు తెలిసే సరికి సాయంత్రం ఐపోయింది. ఇప్పుడేం చెయ్యాలి?

ఏమో, తెలీదు.

గీత వాళ్ల నాన్న ఉండి ఉంటే, ఆయన ఏదో ఒకటి చేసేవాడు. ఇప్పుడు మరి, ఆయన లేడు కదా, ఏ ఒకటి చెయ్యాలో ఎవ్వరికీ తెలీదు.

గీత వాళ్లమ్మ క్యాండిల్ కోసం వెతికింది. చిన్న ముక్క ఉండాలి ఎక్కడో. కానీ అదిప్పుడు

దొరకలేదు.

గీతకు, వాళ్లమ్మకు ఏం చెయ్యాలో తెలీలేదు.

గీత వాళ్ల నాన్నే ఉండి ఉంటే, ఆయన ఏదో ఒకటి చేసేవాడు.

సాయంత్రం కాస్తా రాత్రి అయ్యింది మెల్ల మెల్లగా . చుట్టూ అందరి ఇళ్లలోనూ లైట్లు వెలిగాయి. గీత వాళ్లింట్లో మటుకు చీకటి రాజ్యం ఏలుతోంది. గీత, వాళ్లమ్మ ఇంటి ముందు మెట్ల మీద కూచున్నారు చీకట్లోనే.



దోమలు "గుయ్...గుయ్.." మంటున్నాయి చెవుల్లో.

రాత్రికి అన్నం తినేదెట్లాగ? తెలీదు.

ఈ దోమలతో నిద్రపోయేదెట్లాగ? తెలీదు.

దోమతెర ఎక్కడుంది? దాన్ని కట్టుకునేదెలాగ? తెలీదు.

టి.వి.లో వచ్చే సీరియల్ మ్రోగుతోంది పక్కవాళ్ల ఇంట్లోంచి. మామూలుగా ఐతే అది గీత వాళ్ల ఇంట్లో కూడా మ్రోగుతూ ఉండాలి. గీతకి నిద్ర రావటం మొదలైంది. గీత వాళ్లమ్మకి ఆకలౌతోంది.

ఇంటి లోపల "గణ్..గణ్..." మని ఏదో శబ్దం. "పిల్లా..!?! ..దొంగేమో....?!... దయ్యం కావచ్చు! తెలీదు.

గీత వాళ్లమ్మ లోపలికి వెళ్లి చూడలేదు.

గీతకూడా చూడలేదు.

గీతవాళ్ల నాన్నే ఉండి ఉంటే , ఆయన ఏదో ఒకటి చేసేవాడు. ఆయన ఒక్కరోజు పనిమీద పట్నం వెళ్లాడు, రేపు సాయంత్రానికి గానీ రాడు...

ఇంట్లో ఎవరో కుర్చీని నెట్టినట్లున్నారు- "గణ్..ణ్..ణ్.."మని శబ్దం వచ్చింది.

అటుపైన బీరువా తలుపు శబ్దం-

"పోవ్... ఏంటా శబ్దం?" అడిగింది గీత వాళ్లమ్మ.

"ఏమో తెలీదు" అంది గీత.

నిజంగానే , అ పాప అసలు ఏ శబ్దాన్నీ వినలేదు!

గీత వాళ్లమ్మకు ఏం చెయ్యాలో తెలీలేదు.

వాళ్ల నాన్న ఉంటే......

ఎవరో బట్టని పట్టుకొని చింపుతున్నట్లు "పర్.." మని శబ్దం వచ్చింది ఇంట్లోంచి.

"ఇంటిలో ఎవరో ఉన్నారు-

..ఇంటికున్నది ఒకటే వాకిలి. ఆ వాకిలి దగ్గరే, గీత వాళ్లు కూర్చున్నది! మరి ఎవరైనా ఎట్లా వెళ్లి ఉంటారు, లోపలికి?..."

"పోవ్, వినిపించిందా, శబ్దం?" అమ్మ అడిగింది మళ్లీ.

గీత బద్ధకంగా తల ఊపింది. " ఆ c- కానీ అదేంటో నన్ను అడగొద్దు అమ్మా.. నాకు తెలీదు... నిద్రొస్తోంది..."

గీత వాళ్ల అమ్మ లోపలికెళ్లి చూద్దామనుకున్నది. కానీ వెళ్లలేదు. అయితే లోపలికి వెళ్లకుండా ఏం చెయ్యాలి? తెలీలేదు.

అందుకని మళ్లీ అక్కడే కూర్చున్నది, సర్దుకొని.

గీత వాళ్ల నాన్న ఉండి ఉంటే...



వంట ఇంట్లో గిన్నెలన్నీ గణ గణలాడుతున్నై.

శబ్దం తీవ్రత బాగానే పెరిగింది.

గీతకి ఏమీ భయం వెయ్యలేదు. ఆ పాప అక్కడే కూర్చొని కునికి పాట్లు పడుతున్నది.

గీతా వాళ్లమ్మకి భయం వేసింది. పక్కింటి వాళ్లని పిలుద్దామనుకున్నది; వద్దనుకున్నది; సరే పిలుద్దాం అనుకున్నది; చివరికి మరోసారి గీతవాళ్ల నాన్నను తలచుకొని, వెళ్లి పక్కింటి తలుపు తట్టింది.

ఆలోగా మరో సంగతి- గీతకి తలలో బాగా పేలున్నై , వాళ్లమ్మ ఎన్నిసార్లు పేలు ఏరిందో లెక్కలేదు. ఇప్పుడు మళ్లీ మొదలు పెట్టింది. ఒక్కొక్క పాయనీ వేరు చేస్తూ , ..పేలు చూస్తోంది, జాగ్రత్తగా. నిద్రమత్తులో సగం జోగుతున్న గీతకి ఇలా పేలు చూస్తుంటే హాయిగా అనిపిస్తోంది. ఇంకా నిద్రవస్తోంది మత్తుగా.

ఆ టైంలో తలుపుతట్టిన గీతా వాళ్లమ్మని చూసి పక్కింటి వాళ్లు ఆశ్చర్యపోయారు. "కరెంటు లేదా? మరి చెప్పలేదేం, ఇంతసేపూ?" అన్నారు. వాళ్లబ్బాయి కటింగ్ ప్లయర్సూ, స్క్రూడ్రైవరూ పట్టుకొని వచ్చే సరికి కొంచెం టైం పట్టింది. వాడు టార్చిలైటు పట్టుకొని బయల్దేరాడు. "ఫ్యూజు పోయి ఉంటుంది ఆంటీ" అంటూ.

గీత వాళ్ల ఇంటి గుమ్మం మీదికి టార్చివేయగానే ఇద్దరూ కెవ్వున అరిచారు!

గీతకి పేలు చూస్తున్న కోతి ఒకటి వీళ్లకేసి, వీళ్ల టార్చికేసి చూసి కోపంగా పళ్లునూరి, గబుక్కున లేచి బయటి గోడదూకి పోయింది!



గీత ఉలిక్కిపడి లేచి- "ఏంటి పో, అట్లా అరుస్తావు? నాకు భయమైంది ఒక్కసారికీ!!" అన్నది మళ్ళీ నిద్రలోకి జారుతూ.

గీతా వాళ్లమ్మకి ఏం అనాలో తెలీలేదు.

కోతి పీకేసిన కరెంటు వైరును పక్కింటి వాళ్ళ అబ్బాయి సవరించగానే ఇంట్లో లైట్లు

వెలిగాయి. ఆ వెలుతురులో గీత వాళ్లమ్మకి వంటింట్లో జరిగిన భీభత్సం అంతా కనబడి ఏడుపు వచ్చినంత పనైంది:

పాలు-పెరుగుతో సహా పప్పులు-ఉప్పులు అన్నీ క్రింద బోర్లించి ఉన్నై. పరుపు బట్టలన్నీ చించి పడేసి ఉన్నై, ఇల్లంతటా. బీరువా రెక్క తీసి ఉంది. అందులో సామాన్లన్నీ నేలమీద కుప్పవేసి ఉన్నై.

"హాఁవ్.. ఒక్క కోతి ఇంత పని చేస్తుందని నాకు తెలీనే తెలీదు!" అన్నది గీత వాళ్లమ్మ.

"నాకూ తెలీదు" అన్నది గీత, నిద్రపోతూనే.

వాళ్లమ్మకి ఆ రోజు రాత్రి నిద్రపట్టలేదు. "వీళ్ల నాన్న ఉండి ఉంటే.." అనుకున్నది సామాన్లన్నీ సర్దుతూ.

నవ్వండి!

ఈ రోజు వేరు!

కస్టమర్: రోజూ కాఫీకి డబ్బు కట్టించుకుంటావు కదా! ఇవాళ ఓ కప్పు కాఫీ ఉచితంగా ఇస్తే ఎంత బాగుంటుంది!

హోటల్ యజమాని: రోజూ కప్పునిండా కాఫీ తాగుతున్నారు కదా, ఇవాళ్ల ఓ ఖాళీ కప్పుతో కాఫీ తాగితే ఎంత బాగుంటుంది!

డూప్లికేట్ సమస్య!

రోగి: డాక్టర్! నేను తాళం చెవి మింగేశాను.


డాక్టర్: ఎప్పుడు?

రోగి: మూడు నెలల కిందట డాక్టర్.

డాక్టర్: మరి అప్పటినుండి ఏం చేస్తున్నారు?

రోగి: డూప్లికేట్ తాళం వాడుతున్నాను డాక్టర్!

అందని మామిడి పళ్ళు


1
రాజు, తేజు ఇద్దరూ చాలా మంచి స్నేహితులు.
ఒకసారి వాళ్ళో తోటకి వెళ్ళారు..
అబ్బ! ఎన్ని మామిడి పళ్ళో! ఎట్లా కోసుకోవాలబ్బా!?
రాళ్ళు వేసి కొడదాం!
2
ఒద్దురా! ఆ రాళ్ళు ఎవరికైనా తగిలితే పాపం, తల పగుల్తుంది!
పగిలితే పగలనియ్యిరా, మనకేంటి?
తేజు రాళ్ళు విసిరాడు..
3
రాజు పళ్ళేరి ఇకిలించాడు.. కానీ వాళ్ళ సంతోషం నిలిచింది ఒక్క క్షణమే!
తర్వాతి క్షణంలో వాళ్ళు విసిరిన రాళ్ళు వాళ్ల నెత్తినే పడ్డాయి!
4
అయ్యో! నాయనోయ్! నొప్పి!
అమ్మో! అబ్బో!
తెలివొచ్చి చూసేసరికి ఇద్దరూ ఆస్పత్రిలో ఉన్నారు!!
5
చెట్లని రాళ్ళతో కొట్టద్దురా అంటే విన్నారా?!
ఆ తర్వాత రాజు-తేజులు ఇంకెప్పుడూ చెట్లపైకి రాళ్ళు విసరలేదు.

చిట్టి పాటలు



సేకరణ, గానం: జి. అంజలి, రెండవ తరగతి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చెన్నేకొత్తపల్లి.

1.బడిగంట



బడిలో గంట ఏమంది?

వేళకు బడికి రమ్మంది.

గుడిలో గంట ఏమంది?

దేవుడి పూజకు రమ్మంది.

సైకిల్ గంట ఏమంది?

దారికి అడ్డం రాకండది.



2.చిలకా చిలకా

చిలకా చిలకా చిన్నారి మొలకా

మంచం కోసం ఎందుకే అలక

మామకేమో మడత మంచం

అన్నకేమో నవారు మంచం


తాతకేమో నులక మంచం

నాకు నీకు పందిరి మంచం !

3.చారెడు కళ్లకు




చారుడు కళ్లకు కాటుక పెట్టి
నుదుట కుంకమ బొట్టును పెట్టి
జడ కుచ్చులను జంపుగా అల్లి
తెల్లని మల్లెలు జడలో ముడిచి
ఇరుగు పొరుగు పిల్లలతో
చేయి చేయి కలుపుకొని
కలసి మెలసి ఉందాము;
వేళకు బడికి పోదాము.



4.పిల్లలం బడి పిల్లలం

పిల్లలం బడి పిల్లలం
ఆడే పాడే పిల్లలం
కళ్ళకు గంతులు కట్టుకొని
దాగుడు మూతలు ఆడేస్తాం
కప్పగంతులు తొక్కుడు బిళ్ల
కబడ్డీ ఆటలు ఆడేస్తాం.
ఆటలంటే మాకిష్టం
పాటలంటే మాకిష్టం.

5. బలే పనస



బలే బలే పనస

పసందైన పసన

పచ్చా పచ్చని పనస

తోలు ఉన్న పనస

బలే బలే పనస

పసందైన పనస



కోడి కూత-పొడుపు కత

రచన: చింకీ *సౌజన్యం: శ్రీ కిశోర్ కుమార్ గారు.*

మా ఊరు పుట్టినప్పటినుంచి కోడికూతల ప్రవాహమే!

కొండమీద పోతున్న నదిని లాగి నేల సేద్యానికి దారి తీసిందో ఇంద్రకోడి (ఇంద్రుడు)

పాల గంపలోనుంచి తొంగి చూసి ధర్మగీత గీసిందో నల్లకోడి (విష్ణుమూర్తి)

అహంకరించి కంగుతిన్న ఓ కోపిష్టికోడి జ్ఞానమంత్రం పంచి ఇచ్చింది (విశ్వామిత్రుడు)

పుట్టలో మునిగి లేచిన ఓ వేటకోడి, రాలిన పిట్టపై జాలిగొంది- సిసలు మనిషి కథను వేకువ కావ్యంచేసింది (వాల్మీకి)

సంసారాన్ని, రాజ్యాన్ని విసిరేసి కోరికల చరమ గతి గుట్టు విప్పిందో చెట్టుకింద కన్ను తెరిచిన కోడి (గౌతమ బుద్ధుడు)

పందెం గెల్చిన మరో రాచకోడి దారి ప్రక్కన శాంతి వృక్షమైంది (అశోకుడు)

మా ఊరి కోడే శూన్యంతో అంకెలను సంకెలచేసి అనంతాన్ని దర్శింపజేసింది-లెక్కలకు రెక్కలిచ్చింది (ఆర్యభట్ట)

జంతువులతో నీతి కథలు పలికించిందొక చతుర కోడి (విష్ణుశర్మ)

పసిప్రాయంలోనే మనసు గెల్చిన కాలడి కోడి మాయ సౌందర్యం అంతరాల్ని చీల్చి అంతా ఆ 'ఒక్క' పదార్థమేనని నిగ్గు తేల్చింది (ఆది శంకరాచార్య)

అవమానాన్ని దిగమ్రింగిన మరోకోడి పరాయి పాలనపై సాత్వికోద్యమంతో కన్నెర్ర చేసింది (మహాత్మాగాంధీ)

ఎక్కడినుంచో వచ్చిన ఓ తల్లి కోడి ఇక్కడి గాయాలకు మానవత్వపు కట్లు కట్టింది (మదర్ థెరెసా)

మా ఊరి ప్రతి మలుపులో ఏదో ఒక కోడి- పిల్ల కోళ్ళకు తత్వ బీజాలను కొసరి కొసరి తినిపిస్తూనే ఉంటుంది

ఒక్కో కోడి కూసినప్పుడల్లా మా ఊర్లో ఒక్కో ఉదయం పూస్తుంటుంది

మా ఊరి పేరు భరత జాతి -

మా కోడి కూత పేరు పురోగతి

ఐకా సుబోటా

యువకెరటాలు

నిర్వహణ: సౌమ్య, పుస్తకం.నెట్



ఐకా సుబోటా జపాన్‌లోని ఒక చిన్న పట్టణానికి చెందిన అమ్మాయి. 1991 లో పన్నెండేళ్ళ వయసులోనే బ్రెయిన్ హేమేరేజ్ కారణంగా చనిపోయింది. కానీ, అంత చిన్న వయసులోనే ఆమె చేసిన ఒక పని వల్ల, ఇప్పటికీ ఆమె గురించి మనం మాట్లాడుకుంటున్నాం.

పేరుకి చిన్నమ్మాయే అయినా, ఐకా కు మన పర్యావరణం గురించి, 'దాన్ని పరిరక్షించడం ఎలా?' అన్న అంశం గురించి చాలా ఆలోచనలు ఉండేవి. ప్రకృతి అంటే ఇష్టంగా ఉండేది. ఈ నేపథ్యంలో నుంచే "పుడమి రహస్యాలు" పుట్టింది.

స్వతహాగా పిల్లలందరికీ ఉన్నట్లే ఈమెకి కూడా బొమ్మల పుస్తకాలన్నా, బొమ్మలు గీయడం అన్నా చాలా ఇష్టం. అలా నెమ్మదిగా, తన సొంత బొమ్మలు, పాత్రలు సృష్టిస్తూ, కార్టూన్లు గీయడం నేర్చుకుంది. దీనితో పాటు, వాళ్ల అమ్మానాన్నల సాయంతో పర్యావరణం గురించి రకరకాల విషయాలు తెలుసుకున్నది. మనుషులు చేసే పనుల వల్ల పర్యావరణానికి ఎలా హాని కలుగుతోందో, పర్యావరణ పరిరక్షణ మనకెందుకు అవసరమో అర్థం చేసుకుంది. స్కూల్లో ఇదే అంశం పైన ఒక హోం వర్క్ ఇచ్చేసరికి, తనకు బొమ్మలు వేయటం బాగా వచ్చు కదా, అందుకని పిల్లలందరికీ అర్థమయ్యేటట్లు పర్యావరణం గురించి కామిక్స్ తయారు చేయడం మొదలుపెట్టింది.

అట్లా తయారు అయిన పుస్తకమే "సీక్రెట్స్ ఆఫ్ ఎర్త్". ఇందులో, మూడు ప్రధాన పాత్రలుంటాయి - ఒక చిన్న అమ్మాయి, ఒక చిన్న అబ్బాయి, భూమి! అవును, ఇందులో మన భూమి కూడా ఒక పాత్ర! ఈ పిల్లలిద్దరూ వాళ్ల లైబ్రరీలో వెతుక్కుంటూ ఉంటే "సీక్రెట్స్ ఆఫ్ ఎర్త్" అని ఒక పుస్తకం

దొరుకుతుంది. వాళ్ళు దాన్ని తెరిచేటప్పటికి, "హాయ్!" అంటూ అందులోంచి భూమి బయటకు వచ్చేస్తుంది. తన కథ చెబుతుంది; వీళ్ళ సందేహాలు తీర్చడం మొదలుపెడుతుంది. తనకు కలిగిన ఇబ్బందుల గురించి చెబుతుంది. వాటిని విని కదిలిపోయిన పిల్లలు "నీకు మేమేం సాయం చేయగలం" అని అడుగుతారు. అప్పుడు భూమి పర్యావరణ కాపాడుకునేందుకు మనం ఏమేం చెయ్యాలో చెబుతుంది. అదన్నమాట, ఐకా రాసిన పుస్తకం కథ-

చక్కటి ఆలోచన కదూ?!

ఇలా పుస్తకం పూర్తి చేసిన తర్వాత కొద్ది రోజులకే ఐకా ఉన్నట్లుండి బ్రెయిన్ హేమరేజ్‌తో చనిపోయింది. 'పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చేయగలరు' అని నమ్మకం, ఐకా వాళ్ల అమ్మానాన్నలకు. ఐకా కు గుర్తుగా వాళ్ళు తను రాసిన ఈ పుస్తకానివి యాభై కాపీలు ముద్రించి, ఆమె క్లాసు పిల్లలకి, టీచర్లకి పంచి పెట్టారు.

తరువాత ఆ పుస్తకం అలా అలా జపాన్‌లో చాలామంది పిల్లలకు నచ్చింది! జపాన్‌ను దాటి చాలా చోట్లకి విస్తరించింది. ఇంగ్లీషు, అరబిక్, చైనీస్ భాషల్లోకి అనువదితమయింది. చాలా స్కూళ్ళలో పాఠ్యపుస్తకం కూడా అయ్యింది. తెలుగులోకి కూడా వచ్చేసింది!

ఆపైన పర్యావరణం కోసం పని చేస్తున్న ఎన్నో సంస్థలు ఆమె పుస్తకాన్ని గురించి ప్రపంచానికి చాటి చెప్పాయి. ఆ పుస్తకంలోని కథని వీడియో సినిమాగా కూడా తీసారు. అట్లా, ఐకా మన మధ్య లేకున్నా కూడా, చిరంజీవి అయ్యింది అన్నమాట!

మనకు వచ్చిన కళలు చిన్నవే కావొచ్చు, కానీ అవకాశం ఇస్తే అవి మనకున్న పెద్ద పెద్ద ఆలోచనల్ని కూడా గొప్పగా ప్రతిఫలిస్తాయి. వాటి ద్వారా మనం ఉండే ఈ ప్రపంచానికి ఏ కొంచెం మేలు జరిగినా చాలా బాగుంటుంది, కదూ?!

చిలిపి ప్రశ్నలు -తిక్క జవాబులు

నిర్వహణ: వి.వి.యస్. మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమ గోదావరి జిల్లా.

1. పాండవులు అజ్ఞాతవాసం చెయ్యటం ఎలా సాధ్యపడింది!?

జవాబు: అప్పుడు వాళ్లని కనిపెట్టి పట్టుకునేందుకు 'మీడియా' లేదుగా?!

2. గత వైభవాలను తలుచుకుంటూ వర్తమానంలో కాలక్షేపం చేసేవాళ్ళు ఏం కోల్పోతారు!?

జవాబు: భవిష్యత్తు!

3. మంచి డాక్టరు అవ్వాలంటే....!?

జవాబు: మంచి శ్రోత అవ్వాలి!!

4. చౌకగా లభించే సుఖం ఏది!?

జవాబు: నిద్ర

5. హీరోకి పేరు రావాలంటే...!?

జవాబు: డూపు బాగా ఫైట్‌చెయ్యాలి!!

6. కూల్‌డ్రింకు షాపు ఓనర్ వర్కర్‌ని పనిలో నుంచి తీసేస్తే అతను ఏం చేస్తాడు?!

జవాబు: షాపు ఎదురుగా చలివేంద్రం పెడతాడు!

7. వాస్తును నమ్మే ఆఫీసరుతో గుమాస్తా ఏమంటాడు?

జవాబు: " నా సీటు వాస్తు బాగాలేదు, ప్రమోషన్ ఇవ్వండి సార్! " అంటాడు!!

పదరంగం-14

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని ఓ పోస్టుకార్డులో పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-15 తో పాటు ప్రచురించగలం. నిర్వహణ: దేవి, బెంగుళూరు.

1		2		3	
		4	5		
6					
				7	
	8				
9				10	

ఆధారాలు- **నిలువు:**

1. పీత (4)
2. తికమకపడిన మర మనుషులు (6)
3. బయలు దేరమని చెప్పండి (6)
5. స్నానం చేసేటప్పుడు రుద్దుకునేది (2)
8. రెండు అర సోలలు కలిపితే (2)

ఆధారాలు- **అడ్డం:**

1. వేసవిలో మండేవి(3)
4. దీర్ఘంలేని రసాయనం (4)
6. నల్లటి మబ్బులు (5)
7. శరీరం(2)
8. ఆదివారం తరువాత(5)
9. చెరువు, సరస్సులాంటిది (3)
10. తిరగబడిన పదును (3)

పదరంగం 13 కు సమాధానం



పదరంగం-13కి సరైన సమాధానం రాసి పంపిన పిల్లలు:

1. తరుణిస్ఫూర్తి, 4వ తరగతి, గడ్డంనాగేపల్లి, నార్పల.
2. జి.సత్యలక్ష్మి, రెండో తరగతి, ఇంటిబడి, చెన్నేకొత్తపల్లి.
3. ఏ.యస్. నందన, 4వ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.
4. యం.నీహారిక, VI , అరవింద హైస్కూలు, విజయవాడ
5. వి.వినయ్ కుమార్, VII, అరవింద హైస్కూలు.
6. తినాథ్, బోస్, అరవింద హైస్కూలు, విజయవాడ.

సమీక్ష

కొత్తపల్లి - మార్చ్ 2012 సంచికపై ఒక సమీక్ష...

సమీక్షకులు: శ్రీమతి మాలతీ కృష్ణ, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.



"బొమ్మకు కథ"కు మూడు స్పందనలు రావటం మంచి పరిణామం. లలితగారికి, కొత్తపల్లి బృందానికీ తప్పకుండా ఇది సంతోషం కలిగించి వుంటుంది. 'విషాదయాత్ర', 'సాహసయాత్ర' కథల్లో జయదీప్, కార్తీక్‌ల భాష, శైలి, పకడ్బందీగా సాగిన కథనం వారి వయస్సుకు తగ్గ (ఓ పిసరు ఎక్కువే నేమో)పరిణతిని ప్రతిఫలించాయి. జయదీప్ రచనలో ఆంగ్ల సాహిత్యపు వాసనలు కాస్త ఘాటుగానే అనిపించాయి. కార్తీక్ శైలి చిన్నప్పటి తెలుగు డిటెక్టివ్ నవలలని గుర్తుకు తెచ్చింది. రాజేశ్వరి ప్రయత్నం బావుంది - వయసుకు తగ్గ అమాయకత్వంతో.

'పరివర్తన', 'ఇష్టంతో చేస్తే' కథల మధ్య భావసారూప్యత వుంది. మనసుకు నచ్చే పని చెయ్యలేక, చేసే పని పై ఇష్టాన్ని పెంచుకోలేక చాలా మంది అమృత లానే తయారవుతారేమో! నెల ఆఖరున వచ్చే జీతం తప్ప వారిని ఉత్సాహపరిచే విషయమేమీ ఉండదు. అలాంటి ఆవిడకి కూడా మంచి దారి దొరకటం బాగుంది.

'పరివర్తన' కథకి ముందు- దాన్ని యథాతథంగా ప్రచురించలేక మార్చారని వ్రాశారు. అంటే మిగిలిన కథలన్నీ యథాతథంగా ప్రచురిస్తున్నవనా? పిల్లల రచనలలో ఎంత మాత్రం వారి సొంతం, ఏది ఎన్ని మార్పు చేర్పులకు గురవుతున్నది, ఆ కథల్లో పిల్లల పాత్ర ఎంత, ఇది వివరిస్తే బాగుంటుంది. 'ఇష్టంతో చేస్తే' కథాంశం, భాష, కథనం - మూడూ కూడా నాలుగో తరగతి పిల్లవాడికి చాలా పై స్థాయివిగా అనిపించాయి. కథ బాగుంది -అందులో సందేహం లేదు.

విశాల్ వ్రాసిన 'సహాయం ', సాయికుమార్ వ్రాసిన 'చెడపకురా చెడేవు ', ఒరిజినల్‌గా

అనిపించాయి. వేణుగోపాల్ 'మంచి మాటల మహిమ ' లో ఒక మంచి విషయాన్ని, ఓ మంచి వస్తువు ద్వారా చెప్పాడు.

హైమావతిగారి కథకి 'అవ్వ చెప్పిన కథ' అనే శీర్షిక బావుంది. కథలు చెప్పడంలో మంచి టెక్నిక్ వున్న ఆవిడ ఈ శీర్షికతో మరిన్ని కథలనందించటం నిజంగా బాగుంటుంది.

రాధగారి 'ఆవకాయ మంత్రం' సరదాగా వుంది.

నారాయణ గారి 'ఉగాది ' పేరుకీ, కథకీ పెద్ద సంబంధం లేదనిపించింది. అలేఖ్య ఎప్పుడూ అంతకు ముందు వాళ్ళ తాతయ్య ఇంటికి వెళ్ళలేదో- ఏంటో మరి - ఇంటిని గుర్తైనా పట్టలేదు.

చాలా కథలకు ఈసారి బొమ్మలు బాగున్నాయి.

యువకెరటాలలో సౌమ్యగారు వ్రాసిన ఆఖరి పేరా బాగుంది. పాఠ్యపుస్తకాలు, స్కూళ్ళ హద్దులు దాటి పిల్లలు చదువుకోవాలి. నిజంగా! అంతేకాదు - నేర్చుకోవాలనే జిజ్ఞాస, నేర్చుకోవటం అనే తతంగం - నిరంతరంగా సాగుతూనే వుండాలి. అవార్డులకోసమూ కాదు, పరీక్షల కోసమూ కాదు. 'ఇది పరీక్షల నెల - బాగా చదువుకోవాలి' అనుకోవలసి రావడం మనం మార్చలేని దౌర్భాగ్యం. దీని కెవరూ అతీతులు కారు కాబోలు!

ఎలాంటి పరీక్షలూ లేకుండా, ఎగిసిపడే ఉత్సుకతతో, నిరంతర జిజ్ఞాసతో, నిత్య చైతన్యంతో, నేర్చుకోవడమనే సంతోషకరమైన అనుభవమే 'చదువు 'గా అనబడే రోజు కోసం ఎదురు చూద్దాం.

కొత్తపల్లిలో ప్రచురించే కథల్ని సరిచూడటం, పద బంధాలను, వాక్య నిర్మాణాలను సరిదిద్దటం, శైలిలో పత్రికకు అనువుగా సవరణలు చేయటం సంపాదకుల బాధ్యత. కొన్ని సందర్భాలలో, అవసరమనిపిస్తే కథాంశాల మూల రూపాల్ని కూడా మార్చటం జరుగుతుంది. పిల్లలు వ్రాసే కథల్ని త్రిప్పి పంపి వారి ఉత్సాహాన్ని నీరు కార్చటం ఇష్టం లేక పోవటం దీనికి గల అనేక కారణాల్లో ఒకటి. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు సమయం కుదిరితే సరి- లేని పక్షంలో సంపాదకులదే తుది నిర్ణయం. -సం.

ముద్రిత ప్రతుల వెల: ప్రతి ఒక్కొంటికి: 20 రూ.
12 పుస్తకాలకై చందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust", A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సాంకేతికత: ఆనంద్, లక్ష్మి
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
ముఖచిత్రం 'కొత్తపల్లికి నాలుగేళ్ళు': వీరాంజి
చిత్రాలు: అడవి, రామ్, వినయ్, రాజశేఖర్, లక్ష్మి, వెంకట్, సురేష్, జాహ్నవి, కల్యాణి, రాజేష్.
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు: ప్రకృతి బడికి, నందనగ్రామీణ పాఠశాల వారికి, అరవింద స్కూలు వారికి, రిషివ్యాలీ స్కూలు వారికి, తేజ టాలెంటు స్కూలు వారికి, పెద్దపసుపుల, చెన్నేకొత్తపల్లి ZP స్కూళ్ల వారికి, గడ్డం నాగేపల్లి పుల్లయ్యగారికి, శంకర శివరావు గారికి, telugu4kidsవారికి, చిలిపిప్రశ్నల మూర్తిగారికి, 'విద్యార్థి' మాలతీకృష్ణగార్లకి, రాధా రాజశేఖర్ గార్లకి, కంప్యూటర్లలో లైనక్సు వ్యవస్థను చక్కగా అందిస్తున్న ఉబుంటు వారికి, జింప్, ఆడాసిటీ తదితర ఓపెన్ సోర్సు సాఫ్ట్వేరు నిర్మాతలకు, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

పిల్లల్లో సృజనాత్మకత సహజం. కథలు, ఆటలు, పాటలు, బొమ్మలు దానికి ఊతాన్నిస్తాయి. మాతృభాషలో ఇష్టంగా చదవటం, తేలికగా రాయటం వస్తే అటుపైన అన్ని శాస్త్రాలూ సులభంగా వంటపట్టుతాయి-నిజం! అందుకని మీ పిల్లల్లో ఉన్న కాల్పనిక శక్తికి పదును పెట్టండి. వాళ్లను కథలు రాసేందుకు, పాటలు పాడేందుకు, బొమ్మలు వేసేందుకు ప్రోత్సహించండి. వాళ్ళ రచనల్ని మాకు పంపండి. కావాలనిపిస్తే మీరే ఇలాంటి పత్రికనొకదాన్ని మొదలుపెట్టండి- ఎలాగైనా సరే- పిల్లలు పెద్దవాళ్లయ్యేలోగా వాళ్ళు చాలా చాలా తెలుగు కథల్ని చదివేలా, రాసేలా చేయండి. మీ పిల్లలకు ఈ పత్రికలోని కథలు నచ్చుతాయనే మా నమ్మకం- వీటిని వీలైనంత మందితో పంచుకోండి. మీరు రాసిన పిల్లల కథలు ఏమైనా ఉంటే పనిగట్టుకునైనా సరే, మాకు పంపండి. వీలు చేసుకొని ప్రచురిస్తాం.

మంచి పుస్తకం:

పుడమి రహస్యాలు

పన్నెండేళ్ల పాప. ఏం చెయ్యగలుగుతుంది?

చాలానే చెయ్యగలదు అని చూపించింది, జపాను అమ్మాయి ఐకా సుబోటా.

ఎంత చక్కటి బొమ్మలు గీసింది!

పిల్లలు బొమ్మలెందుకు గీయలేరు? కార్టూన్లెందుకు గీయలేరు? అవేమంత బ్రహ్మ విద్యలని?


పిల్లల శక్తిని నిజంగా కళ్లకు కట్టేట్లు చూపించింది ఈ పాప, ఈ పుస్తకంలో.

పర్యావరణ విజ్ఞానంలాంటి ముఖ్యమైన అంశాలను వివరించే లావుపాటి పుస్తకాలన్నీ పెద్దలవి-

ఇదిగో, ఈ పుస్తకం పిల్లలది.

రమ, యాదయ్యలు లైబ్రరీలో వెతుకుతుంటే చాలా మంచి బొమ్మల పుస్తకం ఒకటి దొరుకుతుంది. ఆ పుస్తకాన్ని వాళ్ళు ఇంటికి తెచ్చి తెరవగానే 'పృథ్వి' అనే గుడ్రంవాడొకడు వచ్చేస్తాడు దానిలోంచి. వాడు వాళ్ళిద్దరినీ "భూమి గురించిన అనేక రహస్యాలు తెలిపే అద్భుతలోకం"లోకి తీసుకెళ్తాడు. వాళ్లతోబాటు ఈ పుస్తకాన్ని చదివే ప్రతి బాబూ, ప్రతి పాప కూడా వెళ్తారు! మనం నివసించే ఈ వాతావరణం గురించి తెలుసుకుంటారు, కార్టూన్ బొమ్మల్లో తామూ ఒకరైపోతూ.

పన్నెండేళ్ల పాప ఇంతలేసి సంగతులు ఎలా రాసిందనేది మాత్రం నిజంగా ఆశ్చర్యం.



పుడమి రహస్యాలు

ఐకా సుబోటా

జనవిజ్ఞానవేదిక-మంచిపుస్తకం (మార్చి2011)

36 పేజీలు, 16 రూపాయలు.

నిలకడ

"మా వాడికి బొత్తిగా నిలకడ లేదండీ" చెప్పాడు సుబ్బారావు.

"అంటే ఎప్పుడూ ఎగురుతూ ఉంటాడా?" అడిగాను.

"అవునండీ, కాలు ఒక చోట నిలవదు".

"మరి నోరు?" అడిగా.

"అయ్యో! ఆ నోటి గురించి ఏం చెప్పాలి? బడ బడ వాగుతూనే ఉంటుందెప్పుడూ" అన్నాడు.

"ఓహో! మరైతే ఆకలి బాగానే ఉండి ఉంటుంది" అన్నా.

"అమ్మో! మామూలు ఆకలి కాదు. ఎప్పుడూ ఏదో ఒకటి కరకరా నముల్తూనే ఉంటాడు".

"మరి ఆటలు?"

"ఒకటే ఆడతాడు! ఒకసారి దాగుడు మూతలు, ఒకసారి గోలీలు, ఒకసారి కోతికొమ్మచ్చి, ఓసారి ఇంకేదో, ఓసారి ఇంకేదో. ఆడుతూ ఉండమంటే రోజంతా ఆడతాడు" అన్నాడు సుబ్బారావు.

"ఏమైనా వస్తువులు తయారు చేస్తాడా? రిపేర్లు వగైరాలు?"

"బాగా కనుక్కున్నారు సార్! ఎప్పుడూ ఏదో ఒకటి రిపేరు చేస్తూనే ఉంటాడు. కొత్తగా రోబాట్ బొమ్మ కొనిపెడితే రాత్రికల్లా దాన్ని విరిచి ముక్కలు చేసిపెట్టాడు- లోపల వెలిగే బల్బు ఎలా వెలుగుతుందో చూడాలట!"

"మరి మీ బండి స్పీకర్లనీ వదిలిపెట్టి ఉండడు!" అన్నాను నేను.

"నిజంగానే వదల్లేదు మాస్టారూ! దాన్లో ఎక్కడో ఓ మంచి అయస్కాంతం ఉంటుందట. దాన్ని ఇసకలో దొర్లిస్తే చాలా ఇనప రజను వస్తుందట. ఇనప రజనును అట్టమీద పోసి, క్రింద అయస్కాంతాన్ని కదిలిస్తే చాలట- మహాభారత యుద్ధం కళ్ళముందు కనబడుతుందట!"

"ఓహో, మీవాడికి మహాభారత యుద్ధం కూడా తెలుసా?" అడిగాను నేను ముచ్చట పడుతూ.

"అయ్యో, వాడికి ఉన్నంత కథల పిచ్చి మాకు కూడా ఉండదండీ. ఎప్పుడూ 'కథలు-కథలు' అని వేధించుకు తింటాడు. అప్పటికీ వాళ్ళ అవ్వ ఏవేవో కథలు చెబుతూనే ఉంటుంది. మీకు వాడి గురించి అన్నీ తెలిసినట్లే ఉంది- మా వాడికి కొంచెం మంచి బుద్ధులు ఎలా వస్తాయో చెప్పండి కాస్త! ఏమైనా ధ్యానం నేర్పించమంటారా?"

"వాడికేముందిగానీ, ముందు మీకో మాట చెబుతాను-" అన్నాను.

"చెప్పండి"

"ఏం లేదు, మీవాడిని గురించి చింత పడటం మానెయ్యండి. వాడు చాలా చక్కగా ఎదుగుతున్నాడు- ఇప్పుడే ఏమాత్రం నిలకడ తెప్పించకండి వాడికి. ఇంకొంతకాలం ఇట్లాగే సంతోషంగా ఉండనివ్వండి, పర్లేదు!"

Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in